
WANTED
స్టాఫ్ రిపోర్టర్లు & విలేకర్లు కావలెను
చిత్తూరు, తిరుపతి, నెల్లూరు జిల్లాలు ప్రధాన కేంద్రంగా వెలువడుతున్న
స్వర్ణసాగరం దినపత్రికలో
పనిచేయుటకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని అన్ని మండల కేంద్రాలలో రిపోర్టర్లు
జిల్లా కేంద్రాలలో స్టాఫ్ & రిపోర్టర్లు కావలెను
ఆయా జిల్లాల్లోని రాజకీయాలు, ఇతర అంశాలపై లోతైన విశ్లేషణాలు రాయగల సామర్థ్యం ఉండాలి, అనుభవం, అర్హతను భట్టి ప్రాధాన్యత ఇవ్వబడును
సంప్రదించండి : 94403 52036,9949329705

మా కలం - సామాన్యుడి బలం
# స్వర్ణసాగరం
www.swarnasagaram.in జాతీయ తెలుగు దినపత్రిక
ఆంధ్రప్రదేశ్ తెలంగాణ | సంపుటి : 6 | సంచిక : 234 | పేజీలు : 8 | ఎడిటర్ : డా.దామా విజయ్‌కుమార్ | గురువారం 21 ఆగస్టు 2025 | వెల : 2-00



## ఆన్‌లైన్ గేమింగ్‌పై నిషేధాస్త్రం

- 'ప్రమోషన్ అండ్ రెగ్యులేషన్ ఆఫ్ ఆన్‌లైన్ గేమింగ్ బిల్లు-2025'కు లోక్‌సభ ఆమోదం
- ఆన్‌లైన్ మనీ గేమ్‌లు నిర్వహించినా, ప్రచారం చేసినా జైలుశిక్ష, భారీ జరిమానా
- నగదు బదిలీలకు వీలు కల్పించినా నేరమే
- ఇలాంటి గేమ్‌లతో యువత భవిష్యత్తు దెబ్బతింటోందని కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్
- ఆందోళన డబ్బు ప్రమేయం లేని ఈ-స్పోర్ట్స్, ఆన్‌లైన్ సోషల్ గేమింగ్‌కు ప్రోత్సాహం

2

# అమరావతి సహా 6చోట్ల టాటా

- స్టార్టప్ లకు ఊపిరి పోసేలా రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్
- అమరావతితో పాటు ఐదు చోట్ల ఆర్టీఐహెచ్ కేంద్రాలు
- రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ప్రారంభించిన సీఎం చంద్రబాబు
- 24 గంటల్లో రికార్డు స్థాయిలో 1,67,321 రిజిస్ట్రేషన్లకు గిన్నిస్ వరల్డ్ రికార్డు
- టెక్నాలజీ వల్ల ఉద్యోగాలు పోతాయన్న అంశాన్ని నేను విశ్వసించను
- ఏపీ పారిశ్రామికవేత్తలు గ్లోబల్ కమ్యూనిటీకీ సేవలందించేలా ఎదగాలని కోరుకుంటున్నా




అమరావతి, స్వర్ణసాగరం

'ప్రతి కుటుంబం నుంచి ఓ పారిశ్రామిక వేత్త రావాలనేదే నా నినాదం. ఈ లక్ష్యంతో రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ లు పనిచేస్తాయి అని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్ ఆవిష్కరణలకు కేంద్రంగా మారుతుందని పేర్కొన్నారు. యువ ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలు, స్టార్టప్ లకు ఊతమిచ్చేలా రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ పనిచేస్తుందని స్పష్టం చేశారు. అమరావతితో పాటు రాష్ట్రవ్యాప్తంగా ఐదు చోట్ల ఇన్నోవేషన్ కేంద్రాలను హబ్ అండ్ స్పోక్ మోడల్ లో ఏర్పాటు చేసినట్టు వివరించారు. బుధవారం మంగళగిరిలోని మయూరి టెక్ పార్కులో ఏర్పాటు చేసిన రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ను టాటా సన్స్ ఛైర్మన్ చంద్రశేఖరన్ తో కలిసి ముఖ్యమంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ..'రతన్ టాటా ఆలోచనలను సజీవంగా ఉంచాలని ఇన్నోవేషన్ హబ్ ప్రారంభిస్తున్నాం. రతన్ టాటా నిరాడంబరత, దేశానికి చేసిన సేవ అందరికీ ఆదర్శం. - మిగతా3లో



## నింద మాటున ప్రభుత్వాలు కూల్చేస్తారా?

- న్యాయస్థానాల్లో విచారణ జరగకుండానే, నేర నిరూపణ కాకుండానే పడగొడతారా?
- ప్రధాని, ముఖ్యమంత్రి, మంత్రుల తొలగింపు బిల్లులపై విపక్షాల ముప్పేట దాడి
- బిల్లు ప్రతులను చింపేసి అమిత్ షా పైకి విసిరేసిన విపక్ష సభ్యులు
- నేరారోపణలు ఎదుర్కొంటూ ఏకధాటిగా 30 రోజులు కస్టడీలో ఉంటే పదవుల నుంచి తొలగించే మూడు బిల్లుల రూపకల్పన
- బుధవారం లోక్‌సభలో ప్రవేశపెట్టిన కేంద్రం.. వెంటనే తీవ్ర ఆందోళనకు దిగిన విపక్ష పార్టీలు
- విపక్షపాలిత ప్రభుత్వాలను అస్థిరపరిచేందుకే ఈ బిల్లులు తెచ్చారని మండిపాటు.. అధికార పార్టీ ఎంపీలతో వాగ్వాదం
- తీవ్ర గందరగోళం నడుమ బిల్లులను సంయుక్త పార్లమెంటరీ కమిటీకి సిఫార్సు చేసిన మోదీ సర్కార్

2



## పీఆర్‌సీ కమిషన్ ఛైర్మన్‌ను నియమించాలి

- వెంటనే మధ్యంతర భృతి ప్రకటించాలి
- గత డీఏ, పీఆర్‌సీ బకాయిలు చెల్లించాలి
- ఏ ఉద్యోగికి ఎంత బాకీ పడ్డారో చెప్పాలి
- అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు పథకాలివ్వాలి
- జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ సమావేశంలో ఉద్యోగ సంఘాల నేతల వినతులు
- ఆర్థిక అంశాలన్నీ సీఎం దృష్టికి తీసుకెళ్తాం
- సమస్యల పరిష్కారానికి కృషి: సీఎస్ హామీ

వివరాలు 3లో..

## రాష్ట్ర వ్యాప్తంగా గృహ నిర్మాణశాఖ సర్వే



- మంత్రులు పార్థసారథి, నారాయణ
- "ఎంత మందికి ఇళ్లు కావాలనేదానిపై 15 రోజుల్లో సర్వే చేస్తాం
- ఎన్టీఆర్ హౌసింగ్ కింద గత ప్రభుత్వం పెండింగ్ పెట్టిన బిల్లులు ఇవ్వాలని సీఎం ఆదేశించారు
- హౌసింగ్, టిడ్కో కలిపి 2లక్షల ఇళ్లు సంక్రాంతికి ఇచ్చేలా చర్యలు తీసుకుంటున్నాం
- పీఎంఏవై కింద మిగిలిన 5లక్షల ఇళ్లను రెండో ఏడాది పూర్తి చేసేలా చర్యలు చేపడతాం

అమరావతి, స్వర్ణసాగరం

గృహ నిర్మాణశాఖ రాష్ట్ర వ్యాప్తంగా సర్వే చేసిందని, ఆరు లక్షల మందికి గృహ అవసరాలున్నట్టు గుర్తించామని మంత్రి పార్థసారథి తెలిపారు. గృహనిర్మాణ శాఖపై సీఎం చంద్రబాబు సమీక్ష అనంతరం మంత్రులు పార్థసారథి, నారాయణ మీడియాతో మాట్లాడారు. "ఎంత మందికి ఇళ్లు కావాలనేదానిపై 15 రోజుల్లో సర్వే చేస్తాం. ఎన్టీఆర్ హౌసింగ్ కింద - మిగతా2లో



## రూ. 2కోట్ల విలువైన ఎర్రచందనం దుంగలు స్వాధీనం.. స్మగ్లర్ అరెస్ట్

తిరుపతి(జీవకోన), స్వర్ణసాగరం

తిరుపతి టాస్క్ ఫోర్స్ పోలీసులు దాదాపు రూ.2 కోట్ల విలువైన రెండున్నర టన్నుల ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నారు. కపిలతీర్థంలోని ఏపీ టాస్క్‌ఫోర్స్ కార్యాలయంలో ఎస్పీ పి.శ్రీనివాస్ కేసు వివరాలు మీడియాకు వెల్లడించారు. డీఎస్పీ ఎండీ షరీఫ్ ఆధ్వర్యంలో ఆర్ఐ సాయి గిరిధర్, ఆర్ఎస్ఐ కె.లింగాధర్‌కు చెందిన బలగాలు విజయవాడ – చెన్నై రహదారిలోని కావలి ప్రాంతంలో - మిగతా2లో



## ప్రజా ప్రభుత్వాల మనుగడ గవర్నర్ల దయపైనా?

- సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు
- ప్రభుత్వం, గవర్నర్ మధ్య సామరస్యమేది?
- రెండోసారి ఆమోదించే బిల్లు రాష్ట్రపతి పరిశీలనకా?
- గవర్నర్‌కు ఆ అధికారాలు లేవు: సీజేఐ
- లేని అధికారం తలకెత్తుకుంటున్న సుప్రీం

5

# విశాఖ ఉక్కుపై కుట్ర తగదు చంద్రబాబు'

**రాష్ట్రం లో పరిపాలన పూర్తిగా గాలికి వదిలేశారు**

**ఏ ఒక్క వర్గం సంతృప్తిగా లేదు..సూపర్ సిక్స్ అరకొరగా మొదలు పెట్టినా క్లారిటీ లేదు**

అమరావతి, స్వర్ణసాగరం

విశాఖ ఉక్కును ప్రైవేట్ పరం చేస్తుంటే సీఎం చంద్రబాబు ఏం చేస్తున్నారని శాసన మండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ ప్రశ్నించారు. చంద్రబాబు పాలనపై బొత్స సత్యనారాయణ బుధవారం మీడియాతో మాట్లాడారు. రాష్ట్రం లో పరిపాలన పూర్తి గా గాలికి వదిలేశారు. ఏ ఒక్క వర్గం సంతృప్తి గా లేదు. సూపర్ సిక్స్ అరకొరగా మొదలు పెట్టినా క్లారిటీ లేదు. తల్లికి వందనం పథకంలో ఏడు ఎనిమిది లక్షల మందికి కేంద్రం నుండి డబ్బులు రాలేదని అరకొరగా ఇచ్చారు. అన్న దాత సుఖీభవ అర్హులకు ఇవ్వలేదు. సాంకేతిక కారణం చెప్పి ఎగ్గొట్టారు.వితంతు పెన్షన్స్ ఇవ్వకుండా కారణాలు చెప్తున్నారు. అర్హులైన వికలాంగులకు పెన్షన్స్ తీసేశారు. అబద్ధాలపై చర్యలు తీసుకోవాల్సి వస్తే సీఎం, మంత్రులపై చర్యలు తీసుకోవాలి. స్టీల్ ప్లాంటు లో 32 విభాగాలు ప్రైవేట్ పరం చేశారు. వైఎస్సార్‌సీ పీకి ద్వంద వైఖరి లేదు. విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు అనేదే మా నినాదం.స్టీల్ ప్లాంట్ కి 14 వేల కోట్లు ప్యాకేజీ ఇచ్చినప్పుడే మేము అనుమానం వుంది అని చెప్పాం. స్టీల్ ప్లాంట్ అప్పులు తీరాక ప్రైవేట్ చేయాల ని పన్నాగం చేస్తున్నారు.సీఎం ఢిల్లీ వెళ్లినప్పుడు స్టీల్ ప్లాంట్ గురుంచి ఎందుకు మాట్లాడటం లేదు'అని ప్రశ్నించారు.



స్వర్ణసాగరం



# పీఆర్‌సీ కమిషన్ చైర్మన్‌ను నియమించాలి

అమరావతి

"12వ వేతన సంఘం(పీఆర్‌సీ) కమిషన్ చైర్మన్‌ను వెంటనే నియమించాలి, మధ్యంతర భృతి(ఐఆర్) తక్షణమే ప్రకటించాలి. పెండింగ్‌లో ఉన్న 3 డీఏల్లో 2 వెంటనే ఇవ్వాలి." అని పలు ఉద్యోగ సంఘాల నేతలు ప్రభుత్వానికి విన్నవించారు. అదేవిధంగా 11వ పీఆర్సీ, డీఏ బకాయిలను కూడా చెల్లించాలని కోరారు. ఏ ఉద్యోగికి ఎంత బకాయి ఉందో పే-స్లిప్పుల్లో పేర్కొనాలని విజ్ఞప్తి చేశారు. ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల ఆర్థికేతర, ఆర్థిక సమస్యలన్నీ పరిష్కరించాలని కోరారు. సీఎం చంద్రబాబు ఆదేశాల మేరకు బుధవారం అమరావతి సచివాలయంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ అధ్యక్షతన జరిగిన జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ సమావేశంలో ఉద్యోగ సంఘాల నేతలు పలు అంశాలను ప్రస్తావించారు. ఈ సందర్భంగా విజయానంద్ స్పందిస్తూ.. ఉద్యోగుల ఆర్థికపరమైన అంశాలను గురువారం(ఈరోజు) జరిగే మంత్రివర్గ సమావేశానికి ముందే సీఎం దృష్టికి తీసుకెళ్తానని, ఆర్థికేతర సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. ప్రస్తుత ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఇది తొలి జాయింట్ స్టాఫ్ కౌనిల్ సమావేశమని, ఉద్యోగ సంఘాల నేతలు ప్రస్తావించిన అన్ని అంశాలను నమోదు చేసుకున్నామని తెలిపారు. బుధవారం మధ్నాహ్నం 3 గంటలకు ప్రారంభమైన సమావేశం రాత్రి 8 గంటల వరకు జరిగింది. ఈ సమావేశంలో పాల్గొన్న 14 సంఘాల నాయకులకు మాట్లాడే అవకాశం కల్పించారు. ఆర్థికేతర సమస్యలపై 4 నుంచి 5 గంటలపాటు సుదీర్ఘ చర్చ జరిగింది. ఏపీఎన్జీజీవో సంఘం అధ్యక్షుడు విద్యాసాగర్, ఏపీ సచివాలయ ఉద్యోగుల సంఘం కార్యదర్శి మనోహర్, ఏపీ రెవెన్యూసర్వీసెస్ అసోసియేషన్, ఏపీ జేఏసీ అమరావతి చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు, యూటీఎఫ్ అధ్యక్షులు ప్రసాద్, ఏపీటీఎఫ్ అధ్యక్షుడు హృదయరాజు, ప్రభుత్వ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. కాగా, సచివాలయ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు వెంకట్రామిరెడ్డి సస్పెన్షన్‌లో ఉండడంతో సమావేశానికి ఆయనను అనుమతించలేదు. అయితే, ఉద్యోగిగా మాత్రమే తాను సస్పెన్షన్‌లో ఉన్నానని, సంఘం నేతగా కాదని వ్యాఖ్యానించారు. ఇక,



ఈ సమావేశం అనంతరం ఉద్యోగ సంఘాల నేతలు మీడియాతో మాట్లాడారు.

### నగదు రహిత వైద్యం: ఎన్జీజీవో

12వ పీఆర్‌సీ కమిషన్ చైర్మన్‌ను వెంటనే నియమించాలని కోరినట్టు ఏపీ ఎన్జీజీవో సంఘం అధ్యక్షుడు అలపర్తి విద్యాసాగర్ తెలిపారు. ఉద్యోగులకు ఆసుపత్రుల్లో నగదు రహిత వైద్యానికి సంబంధించి చర్చించామన్నారు. 7 వేల మంది కాంట్రాక్టు ఉద్యోగులకు ఇచ్చిన పర్మినెంట్ హామీని అమలు చేయాలని, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు ప్రభుత్వ పథకాలు అమలు చేయాలని కోరామన్నారు. గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులకు నోషనల్ ఇంక్రిమెంట్లు ఇవ్వాలని, 4, 5 నెలలకు ఒకసారైనా జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ సమావేశం నిర్వహించాలని విజ్ఞప్తి చేశామన్నారు. 24 ప్రధాన డిమాండ్లు, 68 డిపార్ట్‌మెంట్ అంశాలను ప్రస్తావించామన్నారు. గురుకుల సొసైటీల్లో ఉద్యోగులకు పదవీ విరమణ వయసును 62 ఏళ్లకు పెంచాలని, సీపీఎస్ ఉద్యోగుల డీఏ బకాయిలను వెంటనే చెల్లించాలని కోరామన్నారు. హెడ్ ఆఫ్ ది డిపార్ట్‌మెంట్స్ ఉద్యోగులకు అమరావతి రాజధాని ప్రాంతంలోనే ఇంటి స్థలాలను కేటాయించేలా ఇచ్చిన జీవోను తక్షణమే అమలు చేయాలని కోరినట్టు తెలిపారు.

### క్యాబినెట్‌లో చర్చించమన్నాం: ఏపీటీఎఫ్

ఉద్యోగ, ఉపాధ్యాయులకు సంబంధించిన సమస్యలపై గురువారం జరిగే క్యాబినెట్ సమావేశంలో చర్చించి కొన్ని నిర్ణయాలైనా తీసుకోవాలని సీఎసకు విన్నవించినట్టు ఏపీటీఎఫ్ అధ్యక్షుడు హృదయరాజు చెప్పారు. సీపీఎస్ స్థానంలో ఓపీఎస్ అమలు చేయాలని కోరినట్టు తెలిపారు.

### పే స్లిప్పుల్లో బకాయిలు: ఏపీ జేఏసీ

ఉద్యోగులకు, పెన్షనర్లకు చెల్లించాల్సిన బకాయిలను పే-స్లిప్పుల్లో పేర్కొనేలా చర్యలు తీసుకోవాలని కోరినట్టు ఏపీ జేఏసీ అమరావతి చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు తెలిపారు. ప్రజలకు పథకాలను చేరవేసే ఉద్యోగుల గురించి ప్రభుత్వం ఆలోచించకపోవడం బాధాకరమన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు వెంటనే ఐఆర్ ప్రటించాలన్నారు.

### ప్రణాళికతో చేయాలి: సూర్యనారాయణ

ఉద్యోగుల బకాయిల చెల్లింపులకు సంబంధించి ఒక ప్రణాళిక ఇవ్వాలని కోరినట్టు ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం అ?ధ్యక్షుడు సూర్యనారాయణ తెలిపారు. గత జూన్ వరకు రూ.22 వేల కోట్ల వరకు బకాయిలు ఉన్నాయని, ప్రస్తుతం అవి రూ.33 వేల కోట్లకు చేరాయని చెప్పారు. ప్రతి ఉద్యోగికీ ఎంత బాకీ ఉన్నారన్న విషయాన్ని తేల్చాలని కోరినట్టు తెలిపారు.

# ఆన్‌లైన్ గేమింగ్‌పై నిషేధాస్త్రం

న్యూఢిల్లీ:

దేశంలో జనం జేబులను గుల్లచేస్తూ, వారి ప్రాణాలను బలి తీసుకున్న ఆన్‌లైన్ గేమ్‌లకు చెక్‌పెట్టే దిశగా అత్యంత కీలకమైన బిల్లును లోక్‌సభ ఆమోదించింది. డబ్బుతో ముడిపడి ఉన్న ఆన్‌లైన్ గేమ్‌లను నిర్వహించినా లేక ప్రోత్సహించినా లేక ప్రచారం చేసినా జైలుశిక్ష లేదా భారీ జరిమానా.. కొన్నిసార్లు జైలుశిక్షతోపాటు జరిమానా కూడా విధించేలా 'ప్రమోషన్ అండ్ రెగ్యులేషన్ ఆఫ్ ఆన్‌లైన్ గేమింగ్ బిల్లు%-%2025'ని కేంద్ర ప్రభుత్వం రూపొందించింది. ఆన్‌లైన్ మనీ గేమింగ్‌పై ఉక్కుపాదం మోపుతూ కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ బుధవారం బిల్లును లోక్‌సభలో ప్రవేశపెట్టారు. బిహార్‌లో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ(ఎస్ఐఆర్)కు వ్యతిరేకంగా ప్రతిపక్షాలు ఆందోళన కొనసాగించడంతో, చర్చ లేకుండానే ఈ బిల్లు మూజువాణి ఓటుతో సభలో ఆమోదం పొందింది. బిల్లును ఇక రాజ్యసభలో ప్రవేశపెట్టనున్నారు. అక్కడ కూడా ఆమోదం పొందితే రాష్ట్రపతి సంతకంతో చట్టంగా మారుతుంది.

**ఎన్నో కుటుంబాలు నాశనం: స్పీకర్**

ఆన్‌లైన్ మనీ గేమింగ్ యువతకు వ్యసనంగా మారిందని, వారు ఆర్థికంగా నష్టపోతున్నారని, అప్పులపాలై ఆత్మహత్యకు పాల్పడుతున్నారని కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ ఆందోళన వ్యక్తంచేశారు. ఆన్‌లైన్ గేమింగ్ బిల్లుపై ఆయన లోక్‌సభలో కొద్దిసేపు మాట్లాడారు. డబ్బుతో ప్రమేయం లేని ఈ%-%స్పోర్ట్స్, ఆన్‌లైన్ సోషల్ గేమింగ్‌ను ప్రోత్సహించాలని ప్రభుత్వం భావిస్తోందని, ఇందుకోసం ఒక అథారిటీని ఏర్పాటు చేసే అవకాశం ఉందని తెలిపారు. ఆన్‌లైన్ మనీ గేమింగ్ యాప్‌ల వల్ల యువత నష్టపోవడంతోపాటు మనీ లాండరింగ్, ఆర్థిక నేరాలు, మోసాలు సైతం జరుగుతున్నాయని గుర్తుచేశారు.


యాప్‌ల ద్వారా ఉగ్రవాద సంస్థలకు నిధులు అందుతాయని తెలిపారు. దీనిపై చర్చలో పాల్గొనాలని ప్రతిపక్ష సభ్యులను కోరగా, వారు వినిపించుకోలేదు. లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా స్పందిస్తూ... ప్రమాదకరమైన ఆన్‌లైన్ ఆటల వల్ల ఎన్నో కుటుంబాలు నాశనమయ్యాయని, యువత భవిష్యత్తు దెబ్బతిన్నదని ఆవేదన వ్యక్తంచేశారు. ఆన్‌లైన్ గేమ్‌లపై ప్రభుత్వం నిషేధం విధించాలని గతంలో ప్రతిపక్షాలు డిమాండ్ చేశాయని అన్నారు. ఎస్ఐఆర్ చర్చించాలని పట్టుబడుతూ విపక్షాలు పెద్ద ఎత్తున నినాదాలు చేస్తుండడంతో స్పీకర్ సభను గురువారానికి వాయిదా వేశారు.

ఇండియాలో ఆన్‌లైన్ మనీ గేమ్‌ల వల్ల ప్రతిఏటా 45 కోట్ల మంది దాదాపు రూ.20,000 కోట్లు నష్టపోతున్నట్లు ప్రభుత్వం అంచనా వేసింది.

**ఏమిటీ బిల్లు?**

అన్ని రకాల ఆన్‌లైన్ బెట్టింగ్, గ్యాంబ్లింగ్(సట్టా, పోకర్, రమ్మీ, కార్డ్ గేమ్స్)తోపాటు ఆన్‌లైన్ ఫ్యాంటసీ స్పోర్ట్స్, ఆన్‌లైన్ లాటరీలను నిషేధిస్తూ ఈ బిల్లును తీసుకొచ్చారు. డబ్బులు పెట్టి ఆన్‌లైన్‌లో ఆడే క్రీడలపై నిషేధం అమలవుతుంది.

ఆన్‌లైన్ గేమ్‌లకు ప్రచారం చేసినవారు కూడా నేరస్తులే. ఇలాంటి గేమ్‌ల్లో ఒకరి నుంచి మరొకరికి



ఆన్‌లైన్‌లో నగదు బదిలీలకు వీలు కల్పించిన బ్యాంక్‌లు లేదా ఆర్థిక సంస్థలను సైతం శిక్షిస్తారు.

ఆన్‌లైన్ గేమ్‌ను ఏ రూపంలో నిర్వహించినా, ప్రోత్సహించినా, ప్రచారం చేసినా నేరమే. అంటే కంప్యూటర్ లేదా మొబైల్ ఫోన్ ద్వారా చేసినా నేరంగా పరిగణిస్తారు. సోషల్ మీడియా లేదా పత్రికలు లేదా టీవీల్లో ప్రచారం చేసినా శిక్ష తప్పదు.

నైపుణ్యం లేదా అదృష్టం(చాయిస్)పై ఆధారపడిన ఏ గేమ్ అయినా నిషిద్ధమే.

మన దేశంలోనే కాకుండా.. దేశ సరిహద్దుల్లో లేదా విదేశీ గడ్డపై నుంచి గేమ్‌లను నిర్వహించినా దోషులే అవుతారు.

ఈ బిల్లు ప్రకారం.. ఆన్‌లైన్ గేమ్‌ల్లో పాల్గొన్నవారిని దోషులుగా కాకుండా బాధితులుగానే పరిగణిస్తారు.

డబ్బుతో సంబంధం లేదని ఈ%-%స్పోర్ట్స్, ఎడ్యుకేషనల్ గేమ్స్, సోషల్ గేమ్స్‌కు కొన్ని నియంత్రణలను బిల్లు సూచిస్తోంది.

సమాజంలో అశాంతి తలెత్తకుండా చూడాలని, ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాలని బిల్లులో పొందుపర్చారు. డిజిటల్ టెక్నాలజీని బాధ్యతాయుతంగా వాడుకొనేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.

డబ్బు ప్రమేయం లేని ఈ%-%స్పోర్ట్స్ చట్టబద్ధమే అవుతాయి. ఇందుకోసం కేంద్ర క్రీడల శాఖ కొన్ని మార్గదర్శకాలు, ప్రమాణాలు రూపొందించాలని బిల్లులో సూచించారు. విద్యా, సాంస్కృతిక విలువలను పెంపొందించడానికి, నైపుణ్యాభివృద్ధికి, సమాజంలో ప్రజల మధ్య అనుసంధానానికి ఆన్‌లైన్ సోషల్ గేమ్స్‌ను ప్రోత్సహించవచ్చు. ఈ మేరకు కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఐటీ శాఖ, కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ చర్యలు తీసుకోవాలి.

ఈ%-%స్పోర్ట్స్‌కు సంబంధించి శిక్షణ, పరిశోధనలకు ప్రభుత్వం మద్దతు ఇస్తుంది.

? మానసికోల్లాసం, నైపుణ్యాభివృద్ధి కోసం సోషల్, ఎడ్యుకేషన్ గేమ్స్ ఆడుకోవచ్చు.

ఆన్‌లైన్ గేమ్‌లను వర్గీకరించడానికి, రిజిస్టర్ చేసుకోవడానికి రూ.50 కోట్లతో జాతీయ స్థాయిలో గేమింగ్ అథారిటీ ఏర్పాటు చేస్తారు. దీనికి ప్రతిఏటా రూ.20 కోట్లు కేటాయిస్తారు. ఎలాంటి గేమ్ అనేది ఈ అథారిటీ నిర్ణయిస్తుంది. ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తుంది.

**గేమింగ్ సంస్థల అభ్యంతరాలు**

ఆన్‌లైన్ మనీ గేమింగ్‌ను నిషేధించాలన్న ప్రభుత్వ నిర్ణయాన్ని గేమింగ్ సంస్థలు గట్టిగా వ్యతిరేకిస్తున్నాయి. ఇండియా గేమింగ్ ఫెడరేషన్, ఈ%-%గేమింగ్ ఫెడరేషన్, ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఫాంటసీ స్పోర్ట్స్ వంటి సంస్థలు కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షాకు లేఖ రాశాయి. మన దేశంలో ఆన్‌లైన్ స్కిల్ గేమింగ్ పరిశ్రమ నానాటికీ వృద్ధి చెందుతోందని, దీని విలువ రూ.2 లక్షల కోట్లకు చేరిందని వెల్లడించాయి.

ఈ గేమ్‌లతో ప్రతిఏటా రూ.31,000 కోట్లకుపైగా ఆదాయం వస్తోందని తెలిపాయి. ప్రభుత్వానికి ప్రత్యక్ష, పరోక్ష పన్నుల ద్వారా ఏటా రూ.20,000 కోట్లకుపైగా ఆదాయం లభిస్తోందని గుర్తుచేశాయి. ఈ పరిశ్రమ ప్రతి సంవత్సరం 20 శాతం వృద్ధి రేటు నమోదు చేస్తోందని, 2028 నాటికి రెండురెట్లు అవుతుందని పేర్కొన్నాయి. అందుకే ఆన్‌లైన్ గేమ్‌లను నిషేధించాలన్న నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని విజ్ఞప్తి చేశాయి.

**శిక్షలేమిటి?**

ఆన్‌లైన్ గేమ్‌లు నిర్వహిస్తే మూడేళ్ల వరకు జైలుశిక్ష పడుతుంది లేదా రూ.కోటి దాకా జరిమానా చెల్లించాల్సి రావొచ్చు. కొన్ని సార్లు ఈ రెండు శిక్షలూ అనుభవించాలి. ఆన్‌లైన్ మనీ గేమ్‌లకు ప్రచారం చేస్తే రెండేళ్ల దాకా జైలు శిక్ష లేదా రూ.50 లక్షల జరిమానా విధిస్తారు. కొన్ని సందర్భాల్లో ఈ రెండు శిక్షలూ విధించవచ్చు. నగదు బదిలీలకు సహకరిస్తే మూడేళ్ల దాకా జైలుశిక్ష లేదా రూ.కోటి జరిమానా విధిస్తారు. కొన్ని సందర్భాల్లో రెండు శిక్ష లూ విధించడానికి ఆస్కారం ఉంటుంది. ఆన్‌లైన్ గేమ్‌లు నిర్వహిస్తూ మళ్లీమళ్లీ దొరికిపోతే 3 నుంచి 5 సంవత్సరాల దాకా జైలుశిక్ష, రూ.2 కోట్ల దాకా జరిమానా తప్పదు. నిందితులపై నాన్ బెయిలబుల్ కేసులు న మోదు చేస్తారు. వారెంట్ లేకుండానే నిందితులను అరెస్టు చేయొచ్చు, విచారించవచ్చు. ఆన్‌లైన్ గేమ్‌లకు ప్రచారం కల్పిస్తే సినిమా నటులైనా, క్రికెట్ ఆటగాళ్లయినా, ఇతర ప్రముఖులైనా శిక్ష నుంచి ఎలాంటి మినహాయింపులు ఉండవు. ఆన్‌లైన్ గేమ్‌లను నిషేధించడం వల్ల ప్రభు త్వం కొంత ఆదాయం కోల్పోయే పరిస్థితి ఉన్నప్పటికీ ప్రజల సంక్షేమాన్ని, సమాజం బాగును దృష్టిలో పెట్టుకొని నిషేధం వైపే మొగ్గు చూపినట్లు సీనియర్ అధికారి

## ప్రజా ప్రభుత్వాల మనుగడ గవర్నర్ల దయపైనా?



న్యూఢిల్లీ

"దేశ పాలన వ్యవస్థలో అతి కీలకమైన గవర్నర్, రాష్ట్ర ప్రభుత్వాల నడుమ సామరస్యం ఉందా? అతి పెద్ద అధికార కేంద్రాలైన ఈ రెండు వ్యవస్థల నడుమ పలు కీలక అంశాలపై రాజ్యాంగంలో పేర్కొన్న మేరకు ప్రజా ప్రయోజనాలే పరమావధిగా సజావుగా సంప్రదింపుల ప్రక్రియ అసలు జరుగుతోందా?"అని సర్వోన్నత న్యాయస్థానం కీలక సందేహాలు లేవనెత్తింది. రాజ్యాంగ నిర్మాతల ఆకాంక్షలను నెరవేర్చడంలో దేశం ఏ మేరకు సఫలమైందో అర్థం కాని పరిస్థితి నెలకొందంటూ ఆవేదన వెలిబుచ్చింది. "అసెంబ్లీలు ఆమోదించే బిల్లులను గవర్నర్ నిరవధికంగా పెండింగ్‌లో ఉంచితే పరిస్థితేమిటి? మెజారిటీ ప్రజల తీర్పు ఆధారంగా ఎన్నికైన రాష్ట్ర ప్రభుత్వ మనుగడ గవర్నర్ల చపలత్వంపై ఆధారపడ్డట్టేగా! ఇది ఏ మేరకు సబబు? రాష్ట్రంలో పాలన తదితరాలపై దీని ప్రభావం తీవ్రంగా ఉండదా?"అంటూ ప్రశ్నాస్త్రాలు సంధించింది. అసెంబ్లీ రెండోసారి ఆమోదించి పంపే బిల్లులను రాష్ట్రపతి పరిశీలనకు పంపే అధికారం గవర్నర్లకు లేదని పునరుద్ఘాటించింది. "ఆర్టికల్ 200 ప్రకారం ఈ విషయంలో గవర్నర్ ముందు నాలుగు మార్గాలున్నాయి. బిల్లుకు ఆమోదం, పెండింగ్, రాష్ట్రపతి పరిశీలనకు పంపడం, అసెంబ్లీ పరిశీలనకే తిప్పి పంపడం. అసెంబ్లీ గనక బిల్లును మళ్లీ ఆమోదించి పంపితే దాన్ని రెండోసారి రాష్ట్రపతి పరిశీలనకు పంపే అధికారం గవర్నర్‌కు లేదు"అని స్పష్టం చేసింది. రాష్ట్రాల అసెంబ్లీలు ఆమోదించిన బిల్లులకు ఆమోద ముద్ర వేసే విషయంలో గవర్నర్లతో పాటు ఏకంగా రాష్ట్రపతికి కూడా గడువు నిర్దేశిస్తూ సుప్రీంకోర్టు ఇటీవల సంచలనాత్మక తీర్పు వెలువరించడం తెలిసిందే. ఈ విషయంలో సుప్రీంకోర్టు తన పరిధి దాటి వ్యవహరించిందని పలువురు న్యాయ నిపుణులు కూడా అభిప్రాయపడ్డారు. అనంతరం ఈ విషయమై సర్వోన్నత న్యాయస్థానానికి ఉన్న అధికార పరిధిపై పలు రాజ్యాంగపరమైన సందేహాలు లేవనెత్తుతూ ప్రధాన న్యాయమూర్తికి రాష్ట్రపతి ఏకంగా ప్రశ్నావళి పంపడం మరింత కలకలం రేపింది. సీజేఐకి రాష్ట్రపతి ప్రశ్నావళి పంపడం తాలూకు రాజ్యాంగబద్ధతను సవాలు చేస్తూ తమిళనాడు, కేరళ ప్రభుత్వాలు దాఖలు చేసిన పిటిషన్లపై సీజేఐ జస్టిస్ బీఆర్ గవాయ్ సారథ్యంలోని ఐదుగురు న్యాయమూర్తుల ధర్మాసనం బుధవారం సుదీర్ఘంగా విచారణ జరిపింది. గవర్నర్ల నియామకం, అధికారాలకు సంబంధించి రాజ్యాంగ పరిషత్‌లో జరిగిన చర్చలను ఉటంకిస్తూ కేంద్రం తరఫున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదనలు విన్పించారు. కొందరు ఆరోపిస్తున్నట్టుగా గవర్నర్ పదవి రాజకీయ ఆశ్రయానికి ఉద్దేశించినది కానే కాదని మెహతా స్పష్టం చేశారు. రాజ్యాంగం నిర్దేశించిన మేరకు గవర్నర్‌కు పలు కీలక అధికారాలు, బాధ్యతలు దఖలు పడ్డాయని గుర్తు చేశారు. "రాష్ట్రపతికి, గవర్నర్లకు ఇలా గడువు నిర్దేశించడమంటే అత్యున్నత వ్యవస్థల్లో ఒక వ్యవస్థ రాజ్యాంగం తనకు దఖలు పరచని అధికారాలను నెత్తిన వేసుకోవడమే తప్ప మరోటి కాదు. అంతిమంగా ఇది రాజ్యాంగపరమైన అవ్యవస్థకే దారి తీస్తుంది"అని హెచ్చరించారు. గవర్నర్లు తమ విచక్షణాధికారాన్ని అత్యంత పరిమితంగా మాత్రమే ఉపయోగిస్తారని చెప్పుకొచ్చారు. దీనిపై ధర్మాసనం సూటిగా స్పందించింది. "చట్టం అమలు తాలూకు తీరుతెన్నులపై తమ అభిప్రాయాలు వ్యక్తం చేస్తామే తప్ప తమిళనాడు ప్రభుత్వం, గవర్నర్ కేసులో రాష్ట్రపతికి, గవర్నర్లకు గడువు విధిస్తూ సుప్రీం ధర్మాసనం వెలువరించిన నిర్ణయంపై కాదు. ఈ విషయంలో సలహాపూర్వక న్యాయపరిధికే పరిమితం అవుతాం తప్ప అపీల్ కోర్టులా వ్యవహరించబోం"అని స్పష్టం చేసింది. సీజేఐ ధర్మాసనంలో న్యాయమూర్తులు జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ విక్రంనాథ్, జస్టిస్ పీఎస్ నరసింహ, జస్టిస్ ఏఎస్ చందూర్కర్ ఉన్నారు.

## మొసళ్లతో పోరాడి గెలిచిన మహిళలు

**భర్త, చిన్నారిని కాపాడుకున్న వైనం**

**ధైర్యసాహసాలు ప్రదర్శించిన ఇద్దరు మహిళలు**



బహ్రెయిచ్

తమ వారికి ఏదైనా ఆపదొస్తే మహిళ అపరకాళిగా మారుతుందన్న విషయాన్ని ఉత్తరప్రదేశ్ మహిళలు రుజువుచేశారు. ప్రవాహంలో హఠాత్తుగా ప్రత్యక్షమై ప్రాణసంకటంగా మారిన మొసళ్ల నుంచి తమ వారికి ఇద్దరు మహిళలు రక్షించుకున్న ఘటనలు ఆదివారం బహ్రెయిచ్ జిల్లాలో జరగ్గా ఆలస్యంగా వెలుగులోకి వచ్చాయి. ృభర్త కాలిని నోట కరిచిన మొసలి నుంచి భార్య కాపాడగా, మరో ఘటనలో ఐదేళ్ల కుమారుడిని మొసలి బారి నుంచి చాకచక్యంగా కాపాడి మరో మహిళ తన తల్లిప్రేమను నిరూపించుకుంది. ఖైరీఘాట్ పరిధిలోని ఘాఘ్రా నదీప్రవాహానికి అనుసంధానంగా ధకియా గ్రామంలో ఒక కాలువ ప్రవహిస్తోంది. ఇందులోకి ఏడు అడుగుల మొసలి వచ్చిచేరింది. ఆదివారం కాలువ సమీపంలో ఆడుకుంటున్న ఐదేళ్ల బాలుడు వీరును అది ఒక్కసారిగా నోటకరిచి కాలువలోకి లాక్కెళ్లింది. అక్కడే ఉన్న బాలుడి తల్లి మాయా ఒక్క సెకన్ కూడా ఆలోచించకుండా వెంటనే మొసలిని సమీపించి తన వద్ద ఉన్న ఇనుప రాడ్డుతో దానిపై దాడిచేసింది. ఆపకుండా పలుమార్లు రాడ్‌తో కొట్టడంతో దెబ్బలకు తాళలేక అది బాలుడిని విడిచిపెట్టింది. విషయం తెల్సుకున్న బహ్రెయిచ్ డివిజనల్ ఫారెస్ట్ ఆఫీసర్ అక్కడికి చేరుకుని కాలువలోకి మళ్లీ మొసళ్లురాకుండా వలలు ఏర్పాటుచేయించారు. మోతీపూర్ పరిధిలోని మాధవపూర్ గ్రామంలో అటుగా వెళ్లేందుకు రామ్‌తాలియా కాలువ దాటాల్సి ఉంటుంది. ఆదివారం 45 ఏళ్ల సైఫూ తన భార్య సుర్జానా, బంధువుతో కలిసి కాలువ దాటుతుండగా అందులోని పెద్ద మొసలు సైఫూ కాలిని నోట కరిచి కాలువ లోపలికి లాక్కెళ్లింది. ప్రాణభయంతో సైఫూ అరడం మొదలెట్టాడు. పక్కనే ఉన్న భార్య సుర్జానా ఏమాత్రం భయపడకుండా చీర కొంగును అతని వైపు విసిరి పట్టుకుని బయటకు లాగింది. ఇది చూసిన సమీప గ్రామస్థులు పరుగున వచ్చి కర్రలతో మొసలిపై దాడి చేసి సైఫూ కాలిని ఎలాగోలా విడిపించారు.

మా కలం - ప్రజాభ్యుదయ బలం
స్వర్ణసాగరం
RNI No: APTEL/2020/1906
జాతీయ తెలుగు దినపత్రిక



# అమరావతి సహా 6చోట్ల టాటా

-మొదటిపేజీ తరువాయి

అమరావతిలో రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ను ప్రారంభించటం ఓ చారిత్రాత్మక సమయం. గివ్ బ్యాక్ టు ది సొసైటీ అనే విధానాన్ని రతన్ టాటా అవలంభించారు. రతన్ టాటా ఆలోచనల్ని భవిష్యత్ తరానికి అందించాలన్న లక్ష్యంతోనే ఇన్నోవేషన్ హబ్ లను ప్రారంభించాం. విజయవాడ, విశాఖ, తిరుపతి, అనంతపురంలోనూ దీనికి అనుబంధంగా కేంద్రాలు పనిచేస్తాయి. ఏపీలోని 175 నియోజకవర్గాల్లో ఇన్నోవేషన్ కేంద్రాలు ఉండాలని నిర్ణయించాం. యువతకు ఉన్న వినూత్న ఆలోచనల్ని క్రోడీకరించి ప్రోత్సహించేలా ఈ ఇన్నోవేషన్ హబ్ పని చేస్తుంది. యువపారిశ్రామిక వేత్తలు అవకాశాలను వాడుకోండి. టెక్నాలజీ వల్ల ఉద్యోగాలు పోతాయన్న అంశాన్ని నేను విశ్వసించను. ఏపీ పారిశ్రామికవేత్తలు గ్లోబల్ కమ్యూనిటికీ సేవలందించేలా ఎదగాలని కోరుకుంటున్నా. అగ్రిటెక్ లో ఇన్నోవేషన్ కు విస్తతమైన అవకాశాలు ఉన్నాయి. వ్యవసాయం, విద్య, వైద్యం, రక్షణ, ఇలా అనేక రంగాల్లో అపారమైన అవకాశాలు ఉన్నాయి.' అని సీఎం వివరించారు. సరైన ప్రభుత్వ విధానాలు అవలంభిస్తే ఆదాయం, సంపద వస్తుంది. భవిష్యత్ అంతా ఐటీ రంగానిదేనని నాడు గుర్తించాను. దేశంలో ఎవరూ చేయనంతగా ఇంజినీరింగ్ కళాశాలలు ఏర్పాటు చేశాం. సంపద సష్టి జరగాలంటే ఆర్థిక వద్ధి అవసరం. గత 10 ఏళ్లలో 11వ ఆర్థిక వ్యవస్థ నుంచి నాలుగో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించాం. త్వరలో మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించబోతున్నాం. అప్పుడు సంపద మరింతగా పెరుగుతుంది. ఈ అవకాశాలను రాష్ట్రం అందిపుచ్చుకోవాలి. దీని కోసం రాష్ట్రాన్ని, అమరావతి సహా వివిధ ప్రాంతాలను సిద్ధం చేస్తున్నాం. ప్రాంతాల వారీగా అభివద్ధి ప్రణాళికలు రచించాం. అమరావతి నగరాన్ని నిర్మించే అవకాశాన్ని దేవుడు నాకిచ్చాడు. క్వాంటం వ్యాలీ, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ ఇక విప్లవాత్మక అంశాలుగా మారబోతున్నాయి. నాణ్యమైన ఉత్పత్తులను తయారు చేసి అంతర్జాతీయ ప్రమాణాలు సాధింటంలో మన పరిశ్రమలు మెరుగైన ఫలితాలు సాధించాలి. ప్రభుత్వం, పరిశ్రమలు, పరిశోధనలు, ఎకో సిస్టం ఉంటేనే అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో ఉత్పత్తులు అందించగలం. దీంట్లో భాగంగానే అమరావతి నగరం క్వాంటం కంప్యూటింగ్ హబ్ గా అభివద్ధి చెందుతుంది. క్వాంటం కంప్యూటింగ్ ద్వారా రియల్ టైమ్ డేటాను విశ్లేషించి క్షేత్రస్థాయిలో అమలు చేస్తాం.' అని చంద్రబాబు చెప్పారు. ఏపీలో ఇన్నోవేషన్, బిజినెస్ స్టార్టప్ ల కోసం రికార్డు స్థాయిలో 1,67,321 రిజిస్ట్రేషన్లు జరిగాయి. 24 గంటల్లో ఈ స్థాయి రిజిస్ట్రేషన్లు జరగటంపై ఏపీ ఇన్నోవేషన్ సొసైటీకి గిన్నిస్ వరల్డ్ రికార్డు నమోదైంది. గిన్నిస్ వరల్డ్ రికార్డును ఆ సంస్థ ప్రతినిధులు సీఎం చంద్రబాబుకు అందచేశారు. రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ప్రారంభోత్సవం సందర్భంగా మయూరి టెక్ పార్క్ ప్రాంగణంలో వివిధ స్టార్టప్ కంపెనీలు తమ ఉత్పత్తులను ప్రదర్శించిన స్టాళ్లను ముఖ్యమంత్రి పరిశీలించారు. రతన్ టాటా ఇన్నోవేన్ హబ్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి మంత్రులు నారా లోకేష్ , నాదెండ్ల మనోహర్, టీజీ భరత్, భారత్ ఫోర్జ్ చైర్మన్ బాబా కల్యాణి, అమర్ రాజా బ్యాటరీస్ చైర్మన్ గల్లా జయదేవ్ తదితరులు

# నింద మాటున ప్రభుత్వాలు కూల్చేస్తారా?

న్యూఢిల్లీ

నేరం రుజువుకాకపోయినా కేవలం నిందారోపణలు ఉన్నాయన్న సాకుతో ప్రజాస్వామ్యయుతంగా ఎన్నికైన విపక్షపాలిత ప్రభుత్వాలను పడగొడతారా? అంటూ పార్లమెంట్ సాక్షిగా మోదీ ప్రభుత్వంపై విపక్ష పార్టీలు ముప్పేటదాడి చేశాయి. విపక్షపాలిత రాష్ట్ర ప్రభుత్వాలను అస్థిరపరిచే కుట్రతో ఈ మూడు బిల్లులను రూపొందించారని విపక్ష సభ్యులు లోక్‌సభలో ధ్వజమెత్తారు. బిల్లులను తక్షణం ఉపసంహరించుకోవాలని నినాదాలతో హోరెత్తించారు. అయితే బిల్లులను సమర్థిస్తూ అధికార పార్టీ సభ్యులు సైతం దీటుగా స్పందించడంతో లోక్‌సభలో ఒక్కసారిగా మాటల మంటలు రాజుకున్నాయి. అధికార, విపక్ష సభ్యుల వాగ్వాదం మధ్య వివాదాస్పద మూడు బిల్లులను ప్రభుత్వం సంయుక్త పార్లమెంటరీ కమిటీకి సిఫార్సుచేసింది. తీవ్ర నేరారోపణలు ఎదుర్కొంటూ ఏకధాటిగా 30 రోజులుగా కస్టడీలో గడుపుతున్న ప్రధానమంత్రి, ముఖ్యమంత్రి, కేంద్ర, రాష్ట్రమంత్రులను పదవి నుంచి తొలగించేందుకు ఉద్దేశించిన మూడు బిల్లులను లోక్‌సభలో కేంద్రం ప్రవేశపెట్టింది. వెనువెంటనే విపక్ష పార్టీలపాలిత రాష్ట్రాల్లో ప్రభుత్వాలను కూలదోసేందుకే మోదీ సర్కార్ ఇలా అత్యంత వివాదాస్పద మూడు బిల్లులను తీసుకొచ్చిందంటూ బుధవారం లోక్‌సభలో విపక్షపార్టీల ఎంపీలు తీవ్ర ఆందోళనకు దిగారు. ఒకదశలో బిల్లు ప్రతులను చింపేసి ఆ ముక్కలను హోంమంత్రి అమిత్‌షా వైపు విసిరేశారు. ఐదేళ్లు, అంతకంటే ఎక్కువ శిక్ష పడే తీవ్రమైన నేరారోపణలు ఎదుర్కొంటూ అరెస్టయి, కస్టడీలో ఏకధాటిగా 30 రోజులుగా ఉన్న సందర్భాల్లో ప్రధానమంత్రి, ముఖ్యమంత్రి, కేంద్ర, రాష్ట్ర మంత్రులను పదవి నుంచి తొలగించేందుకు ఉద్దేశిస్తూ 'గవర్నమెంట్ ఆఫ్ యూనియన్ టెరిటరీస్(సవరణ)బిల్లు, 2025, రాజ్యాంగం(130వ సవరణ)బిల్లు, 2025, జమ్మూకశ్మీర్ పునర్వ్యవస్థీకరణ(సవరణ)బిల్లు, 2025'బిల్లులను అమిత్‌షా లోక్‌సభలో ప్రవేశపెట్టగానే గొడవ మొదలైంది.

**అమిత్, వేణుగోపాల్ మధ్య మాటల యుద్ధం**

బిల్లు ప్రవేశపెట్టగానే అమిత్‌షానుద్దేశిస్తూ కాంగ్రెస్ సీనియర్ సభ్యుడు కేసీ వేణుగోపాల్ మాటలతో విరుచుకుపడ్డారు. "రాజ్యాంగ మౌలికసూత్రాలను ఈ బిల్లులు ఉల్లంఘిస్తున్నాయి. 2010లో సోహ్రాబుద్దీన్ షేక్ నకిలీ ఎన్‌కౌంటర్ కేసులో ఆనాడు రాష్ట్ర హోం మంత్రిగా పదవి వెలగబెడుతూనే అమిత్‌షా అరెస్టయ్యారు. సీబీఐ అరెస్ట్‌తో మూడు నెలలు జైల్లోనే గడిపారు.

మరి ఈ నైతికత ఆనాడు మీకు లేదా?"అని వేణుగోపాల్ సూటి ప్రశ్న వేశారు. దీనికి ఇతర సభ్యులు గొంతు కలిపారు. దీంతో అమిత్‌షా దీటుగా బదులిచ్చారు. "అదొక తప్పుడు కేసు. అయినాసరే అరెస్టయిన వెంటనే పదవికి త్యజించి నా నైతికతను నిరూపించుకున్నా. పదవికి రాజీనామా చేశా. కేసులో నిర్దోషిగా బయటపడేదాకా ఎలాంటి చట్టబద్ద పదవిని చేపట్టలేదు"అని అన్నారు. మధ్యాహ్నం సభ రెండుగంటలకు మళ్లీ మొదలయ్యాక ఈ మూడు బిల్లులను సంయుక్త పార్లమెంట్ కమిటీకి సిఫార్సుచేస్తూ తీర్మానం చేసి మూజువాణి ఓటుతో ఆమోదించిన సందర్భంలో విపక్షసభ్యులు మళ్లీ లేచి నిలబడి నినాదాలుచేశారు. అప్పటికే ఈ మూడు బిల్లుల ప్రతులను కాంగ్రెస్ ఎంపీలు జ్యోతిమణి, ప్రణీత షిండే తోటి ఎంపీలకు పంచారు.

తమ చేతికొచ్చిన బిల్లుల ప్రతులను తృణమూల్ కాంగ్రెస్ నేత కళ్యాణ్ బెనర్జీసహా పలువురు విపక్షసభ్యులు చింపేసి అమిత్‌షా వైపు విసిరేశారు. కొన్ని షా సీటు వద్ద పడ్డాయి. షా ముందున్న మైక్రోఫోన్‌ను లాగిపడేసేందుకు బెనర్జీ విఫలయత్నంచేశారు. దీంతో షాకు రక్షణగా కేంద్ర మంత్రి రవ్‌నీత్ సింగ్ బిట్టూ, పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరెన్ రిజిజులు షా సీటు వద్దకు వచ్చి అడ్డుగా నిలబడ్డారు. వెల్‌లోకి దూసుకొచ్చిన టీఎంసీ మహిళానేత మహువా మొయిత్రాసహా విపక్షనేతల నినాదాలతో సభ మార్మోగింది. కొందరు బీజేపీ సభ్యులు సైతం వెల్‌లోకి దూసుకొచ్చి విపక్షసభ్యులతో వాగ్వాదానికి దిగారు. వీరిని బీజేపీ సభ్యుడునిశికాంత్ దూబే వారించి తమతమ సీట్ల వద్దకు పంపించారు. వివాదాస్పద బిల్లులను ప్రవేశపెట్టడాన్ని తీవ్రంగా తప్పుబడుతూ ఎంఐఎం నేత అసదుద్దీన్ ఒవైసీ, కాంగ్రెస్ నేత మనీశ్ తివారీ, ఆర్‌ఎస్‌పీ నేత ఎన్‌కే ప్రేమచంద్రన్, కాంగ్రెస్ నేత కేసీ వేణుగోపాల్, ఎస్పీ నేత ధర్మేంద్ర యాదవ్ మాట్లాడారు.

తర్వాత సభ మూడు గంటలకు మొదలయ్యాక అమిత్ షాకు రక్షణగా పార్లమెంట్ సెక్యూరిటీ సర్వీస్ నుంచి 12 మంది మార్షల్స్ వచ్చి పక్కనే నిలబడ్డారు. అయినాసరే విపక్షసభ్యులు బిల్లుల వ్యతిరేక నినాదాలను కొనసాగించారు. యావత్ ఘటనపై స్పీకర్ తీవ్రవిచారం వ్యక్తంచేశారు. ఇలాంటి ఉదంతాలు సభ గౌరవాన్ని తగ్గిస్తున్నాయని ఓం బిర్లా ఆవేదన వ్యక్తంచేశారు. ఎల్లవేళలా తెలుపురంగు టీ%–%షర్ట్ ధరించే లోక్‌సభలో విపక్షనేత రాహుల్‌గాంధీ మూడు బిల్లులను వ్యతిరేకిస్తూ అందుకు నిరసనగా నలుపురంగు టీ%–%షర్ట్ ధరించారు.

ఎవరేమన్నారంటే..

**పోలీస్ రాజ్యంగా మారుస్తున్నారు**

"ఇలా మూడు అక్రమ చట్టాలను తెచ్చి భారత్‌ను పోలీస్ రాజ్యంగా మార్చాలనుకుంటున్నారు. సీబీఐ, ఈడీ వంటి ఏజెన్సీలు ఇష్టారీతిన అరెస్ట్‌చేసేందుకు మోదీ సర్కార్ మరింత స్వేచ్ఛనిస్తోంది. ఈ ఏజెన్సీలే జడ్జీలుగా, కార్యనిర్వాహక వ్యవస్థలుగా సొంత నిర్ణయాలు తీసుకుంటున్నాయి. ఈ పోకడ ఎన్నికల ద్వారా కొలువుతీరిన ప్రభుత్వాలకు మరణశాసనం వంటిది. ఈ మూడు బిల్లులు హిట్లర్ పాలనలో నాజీ సైన్యం అధికారిక రహస్య పోలీస్ విభాగాన్ని గుర్తుకుతెస్తున్నాయి. విపక్షాలపాలిత రాష్ట్రప్రభుత్వాలను అస్థిరపరిచేందుకే బిల్లులను తెచ్చారు"

%–% ఎంఐఎం నేత అసదుద్దీన్ ఒవైసీ

**రాజ్యాంగ మౌలికస్వరూపాన్ని నాశనంచేస్తున్నారు.**

"రాజ్యాంగ మౌలిక స్వరూపాన్ని సర్వనాశనం చేసేలా ఈ మూడు బిల్లులను తీసుకొచ్చారు. సీబీఐ, ఈడీ వంటి దర్యాప్తు సంస్థలను ప్రభుత్వం ఇప్పటికే దుర్వినియోగపరుస్తోంది. ఇక ఈ మూడు బిల్లులు చట్టాలుగా మారితే ఈ రాజకీయ దుర్వినియోగ వరదకు గేట్లు ఎత్తినట్లే అవుతుంది. ఈ ధోరణిని ఇప్పటికే సర్వోన్నత న్యాయస్థానం సైతం తూర్పారబట్టింది. కొత్త బిల్లులు రాజ్యాంగపరిరక్షణ అస్త్రాలను నిర్వీర్యంచేస్తున్నాయి"

%–% కాంగ్రెస్ నేత మనీశ్ తివారీ

**'జైలు'పాలనపై నిర్ణయం ప్రజలదే**

"తమ పీఎం, సీఎం, మంత్రులు తీవ్ర నేరారోపణలతో అరెస్టయి జైలు ఉండి అక్కడి నుంచే పరిపాలించడం ఎంతవరకు సబబో ప్రజలే నిర్ణయించుకోవాలి. ప్రజాజీవితం గడిపే పాలకుల్లో తగ్గుతున్న నైతికతకు చెక్‌పెట్టేందుకే ఈ మూడు బిల్లులన తెచ్చాం. రాజకీయాలకు మళ్లీ సమగ్రత తేవడమే బిల్లుల లక్ష్యం. భవిష్యత్తులో పాలకులు తీవ్రనేరాలతో జైలుపాలైనా అక్కడి నుంచే పరిపాలిస్తారని రాజ్యాంగ నిర్ణేతలు ఆనాడు రాజ్యాంగ రచన సమయంలో ఊహించి ఉండరు"

%–% బీజేపీ అగ్రనేత అమిత్ షా

**మధ్యయుగాలకు మోసుకెళ్తాయి**

ఈ మూడు బిల్లులు మళ్లీ దేశాన్ని మధ్యయుగాల నాటి దురవస్థకు తీసుకెళ్తాయి. ఈ బిల్లులు చట్టాలుమారితే ఖచ్చితం మనం మధ్యయుగాలకు వెళ్తాం. అక్కడ రాజు తనకు నచ్చని వ్యక్తులను పదవుల నుంచి పక్కకు తప్పిస్తాడు. ఆ పదవిలోని వ్యక్తి ముఖం కూడా నచ్చలేదంటే ఈడీ రంగప్రవేశంచేసి అరెస్ట్‌చేస్తుంది. నేరారోపణ రుజువుకాకపోయినా కేవలం 30 రోజులుగా జైల్లో ఉన్నాడన్న కారణం చూపి.. ప్రజాస్వామ్యయుతంగా ఎన్నికైన వ్యక్తి ప్రభుత్వాన్ని కూలదోస్తారు"

%–% లోక్‌సభలో విపక్షనేత రాహుల్‌గాంధీ

**అంత తొందరెందుకు?**

'అత్యున్నత పదవుల్లోని నేతలను తొలగించేందుకు ఉద్దేశించిన ఇంతటి కీలకమైన బిల్లులను ఎందుకు హడావిడిగా ప్రవేశపెడుతున్నారు? బిల్లుల గురించి ముందస్తు సమాచారం లేదు. హడావిడిగా బిల్లుల ప్రతులను సభలో నామామాత్రం కొద్దిమందికి పంపిణీ చేసి వెంటనే బిల్లులను లోక్‌సభ ముందుకు తెచ్చారు. సభా నిబంధనలను ఈ బిల్లుల విషయంలో అస్సలు పాటించలేదు"

%–% ఆర్‌ఎస్‌పీ పార్టీ సభ్యుడు, ఎంపీ ఎన్‌కే ప్రేమ్‌చంద్రన్

**ప్రజాస్వామ్యశకానికి పాతరేసే కుట్ర**

"భారత్‌లో ప్రజాస్వామ్య శకానికి ముగింపు పలికే దురుద్దేశంతో ప్రభుత్వం ఈ మూడు బిల్లులు తెచ్చింది. బిల్లులను తేవడం చూస్తుంటే సూపర్ ఎమర్జెన్సీ పీడకలను ప్రభుత్వ పెద్దలు సాకారంచేసుకునేందుకు వేసిన తొలి అడుగులా తోస్తోంది. దేశ న్యాయవ్యవస్థ స్వతంత్రను కాలరాసేందుకు ఈ బిల్లులను తెచ్చారు. ప్రజాస్వామ్యం, సమాఖ్య స్ఫూర్తిని సర్వనాశనంచేసే కుట్ర ఇది. ప్రజాస్వామ్య పరిరక్షణకు ఎంతకైనా తెగించి ఈ బిల్లులు చట్టాలుగా మారకుండా అడ్డుకుందాం"

%–% టీఎంసీ చీఫ్ మమతా బెనర్జీ

**ఇది ఇంగిజ్ఞానానికి సంబంధించింది**

"మీరు 30రోజులపాటు కస్టడీలో ఉండి కూడా మంత్రిగా పదవిలో కొనసాగుతానని వాదించడం ఎంత వరకు సమర్థనీయం? ఇది పూర్తిగా ఇంగితజ్ఞానానికి సంబంధించిన విషయం. ఈ మూడు బిల్లుల్లో నాకైతే ఎలాంటి తప్పు కనిపించట్లేదు. ఈ అంశం మినహా బిల్లుల్లో లోతైన అంశాలు ఉంటే మాత్రం ఖచ్చితంగా సంయుక్త పార్లమెంట్ కమిటీలో చర్చించాల్సిందే. దేశ ప్రయోజనకర అంశాలు ఉన్నాయో లేదో తేల్చాలి"

%–% తిరువనంతపురం కాంగ్రెస్ ఎంపీ శశిథరూర్

## ఖజానాకు భారంగా తాయిలాలు

విజయవాడ

ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్లో సంక్షేమ పథకాల పేరుమీద జరుగుతున్న తాయిలాల పంపకం ఖజానాకు పెనుభారంగా మారుతోంది. గతంలో వైసిపి, ప్రస్తుత కూటమి పోటీపడి మరీ అప్పుల మీద అప్పులు చేస్తూ సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారు. నిజానికి అవసరంలో ఉన్న పేదలను ఆదుకోవాల్సిన అవసరం ప్రభుత్వంపై ఉంది. కానీ దానకర్ణులు అనిపించుకోవడం కోసం సరైన రాబడి రాకుండానే ఇలా ప్రభుత్వాలు సంక్షేమ పథకాల కోసం అప్పుల మీద అప్పులు చేస్తూ వెల్ఫేర్ స్కీమ్ అమలు చేస్తున్న తీరు మేధావి వర్గాల్లో ఏపీ భవిష్యత్తుపై ఆందోళన పెంచుతోంది జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం 2024 లో దిగిపోయేసరికి కేవలం సంక్షేమ పథకాలు కోసం ప్రతి ఏటా 70 వేల కోట్ల వరకూ ఖర్చుపెట్టినట్టు ఆయనే స్వయంగా చెప్పుకున్నారు. దీనికోసం వివిధ కార్పొరేషన్లలోని డబ్బులు సైతం వాడేసారని, ప్రభుత్వ ఆస్తులు తాకట్టుపెట్టి మరీ అప్పులు తెచ్చారని టిడిపి, జనసేన తీవ్రంగా ఆరోపించేవి. ఏపీలో అభివృద్ధి పూర్తిగా పడకేసింది అనేది వారి ప్రధాన విమర్శ గా ఉండేది. అమ్మ ఒడి, నాడు –నేడు లాంటి పథకాల వల్ల చాలామందికి మేలు జరిగిన మాట వాస్తవమే అయినా మిగిలిన అనేక పథకాల వల్ల రాష్ట్ర అభివృద్ధి కుంటుపడింది అనేది చాలామంది ఎనలిస్ట్ లు, ఆర్థిక వేత్తల అభిప్రాయం. అటు అమరావతి పక్కకు పోయి, మూడు రాజధానుల వ్యవహారం బెడిసి కొట్టి, పోలవరం ప్రాజెక్టు అతిగతీ లేని పరిస్థితుల్లో పడిపోవడం తో చివరికి సంక్షేమ పథకాలు సైతం జగన్ ప్రభుత్వాన్ని కాపాడలేకపోయాయి. అప్పట్లో రాష్ట్రం లోని రోడ్ల పరిస్థితులపై సామాన్యులు, ఆటో డ్రైవర్లు, వాహన దారులు తీవ్ర అసంతృప్తి వెళ్ళబుచ్చేవారు. విచిత్రంగా వీరిలో చాలామంది సంక్షేమ పథకాల లబ్ధి దారులే కావడం విశేషం. అంటే ప్రజలకు సంక్షేమంతో పాటుగా అభివృద్ధి, కనీస సౌకర్యాలు ముఖ్యమనేది చాలా స్పష్టంగా పాలకులకు తెలియజేసిన ఎన్నికల ఫలితాలు అవితెలుగు రాష్ట్రాల్లోనే కాదు దేశవ్యాప్తంగా కూడా ప్రో డెవలప్మెంట్ లీడర్గా చంద్రబాబు కు ఒక ప్రత్యేకమైన గుర్తింపు ఉంది. ఎన్ని విమర్శలు వచ్చినా ఆర్థిక పరమైన సంస్కరణలకు ఏమాత్రం వెనుకాడే వ్యక్తి కాదని చంద్రబాబు నాయుడు పేరు తెచ్చుకున్నారు. రాష్ట్ర విభజన తర్వాత 2014 ఎన్నికల్లో ప్రజలు చంద్రబాబుకు పట్టం కట్టడానికి ముఖ్యమైన కారణం ఇదే.

## కర్నూలు జీజీహెచ్‌లో వివాదం

కర్నూలు

కర్నూలు జీజీహెచ్‌లో సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు ఏపీఎంఎస్ఐడీసీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ చిరంజీవులు మధ్య వివాదం రగులుకుంటోంది. ఆసుపత్రిలో అభివృద్ధి పనుల విషయంలో ఇద్దరి మధ్య విభేదాలు రచ్చకెక్కాయి. ఏకంగా సమీక్ష సమావేశం నుంచి ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్ (ఈఈ) బయటకు వెళ్లే వరకు వచ్చింది. బుధవారం కర్నూలు జీజీహెచ్ సూపరింటెండెంట్ చాంబర్‌లో సూపర్ స్పెషాలిటీ బ్లాక్‌లో రూ.45 లక్షలతో నెఫ్రాలజీ, యురాలజీ, న్యూరో సర్జరీ ఆపరేషన్ థియేటర్ల మరమ్మతుల పనులు, ఇతర అభివృద్ధి పనులపై సమీక్ష సమావేశం జరిగింది. ఈ సమీక్షలో హాస్పిటల్ సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లు ఆపరేషన్ థియేటర్ల పనులు ఆలస్యం అవుతున్నాయనీ, దీని వల్ల రోగులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. నాలుగు నెలలుగా పనులు సాగుతున్నాయనీ, గతంలో పని చేసిన ఇన్‌చార్జి ఈఈ కరీముల్లా వేగంగా స్పందించేవారనీ సూపరింటెండెంట్ చెప్పడంతో ఏపీఎంఎస్ఐడీసీ ఈఈ తీవ్ర అసహనానికి గురయ్యారు. పనుల నాణ్యతపై తనకు చెప్పకుండా ఏకంగా ఏపీఎంఎస్ఐడీసీ ఎండీకి ఎలా ఫిర్యాదు చేస్తారని ఈఈ ప్రశ్నించారు. తన సర్వీసు 35 సంవత్సరాలు ఉందని, తన ముందే గతంలో పని చేసిన ఇంజనీర్ అధికారిని పొగడటం ఏమిటన్నారు. ఏకవచనంతో పిలుస్తారా? అంటూ వాదనకు దిగారు. గతంలో పని చేసిన కరీముల్లాతోనే పనులు చేయించుకోండి అంటూ సమావేశం నుంచి బయటకు వెళ్లిపోయారు. ఈ ఘటన ప్రస్తుతం జీజీహెచ్ ఉద్యోగుల్లో చర్చనీయాంశంగా మారింది.

## రూ. 2కోట్ల విలువైన ఎర్రచందనం దుంగలు స్వాధీనం.. స్మగ్లర్ అరెస్ట్

-మొదటిపేజీ తరువాయి

వాహనాల తనిఖీ చేపట్టారు. అక్రమ రవాణా జరుగుతున్నట్లు ముందస్తు సమాచారం అందడంతో కావలి వన్ టౌన్, టు టౌన్, కావలి రూరల్ సీఐ, ఎస్ఐ సహకారంతో కె.బిట్రగుంట ఫారెస్ట్ బీటు పరిధిలో వాహనాలు తనిఖీ చేశారు. రెండు కార్లు, లారీ వేగంగా రావడంతో సిబ్బంది అప్రమత్తమై లారీని వెంబడించి పట్టుకున్నారు. హరియాణాకు చెందిన ఒక వ్యక్తిని పట్టుకుని, లారీలోని 83 ఎర్రచందనం దుంగలు స్వాధీనం చేసుకున్నారు.

## రాష్ట్ర వ్యాప్తంగా గృహ నిర్మాణశాఖ సర్వే

-మొదటిపేజీ తరువాయి

గత ప్రభుత్వం పెండింగ్ పెట్టిన బిల్లులు ఇవ్వాలని సీఎం ఆదేశించారు. హౌసింగ్, టిడ్కో కలిపి 2లక్షల ఇళ్లు సంక్రాంతికి ఇచ్చేలా చర్యలు తీసుకుంటున్నాం. పీఎంఏవై కింద మిగిలిన 5లక్షల ఇళ్లను రెండో ఏడాది పూర్తి చేసేలా చర్యలు చేపడతాం. రెండేళ్లలో మొత్తం 9లక్షల ఇళ్లు పూర్తి చేసేలా హౌసింగ్ విభాగం చర్యలు తీసుకుంటుంది. గత ప్రభుత్వం రూ.2,900 కోట్ల కేంద్రం నిధులను మళ్లించింది. అప్పటి ఆర్థిక అవకతవకలను సీఎం దృష్టికి తీసుకెళ్లాం. గత ప్రభుత్వం తప్పిదం కారణంగా లబ్ధిదారులు చెల్లించాల్సిన ఈఎంఐలు రూ.140 కోట్లను సీఎం ఆదేశాల మేరకు ఈ ప్రభుత్వం చెల్లించింది" అని మంత్రులు వివరించారు.

## స్త్రీ శక్తితో మహిళలకు ఆర్థిక వెసులబాటు



విజయవాడ

స్త్రీ శక్తి ఉచిత బస్సు పథకంతో మహిళల్లో ఆర్థిక స్వాతంత్ర్యం పెరిగిందని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖల మంత్రి ఎస్. సవిత తెలిపారు. విజయవాడలోని బుధవారం పండిట్ నెహ్రూ బస్టేషన్ లో స్త్రీ శక్తి ఉచిత బస్సు పథకంపై మహిళల అభిప్రాయాలను మంత్రి ఎస్. సవిత అడిగి తెలుసుకున్నారు. విజయవాడ నుంచి అమరావతి వెళ్లే ఆర్టీసీ బస్సులో మహిళా ప్రయాణికులతో పయనించి, ఉండవల్లిలో దిగారు. ఈ సందర్భంగా వారితో మంత్రి ముచ్చటించారు. ఉచిత ఆర్టీసీ ప్రయాణంతో కలిగిన లాభాలను అడిగి తెలుసుకున్నారు. సీఎం చంద్రబాబు అమలు చేస్తున్న పథకాలు గురించి వివరించారు. తల్లికి వందనం, ఉచిత ఆర్టీసీ ప్రయాణం, ఉచితంగా 3 గ్యాస్ సిలిండర్లు, ఉచిత ఇసుక వల్ల ఎంతో మేలు కలుగుతోందని మహిళలు ఆనందం వ్యక్తం చేశారు. అన్న క్యాంటీన్ వల్ల రూ.5లకే టిఫిన్, భోజనం వస్తోందని, ఈ పథకం వల్ల కూలీలు, పేదలకు ఎంతో మేలు కలుగుతోందంటూ సీఎం చంద్రబాబుకు మహిళలు ధన్యవాదాలు తెలిపారు. అనంతరం మంత్రి సవిత మీడియాతో మాట్లాడుతూ, విజయవాడ బస్టేషన్ నుంచి అమరావతి వెళ్లే బస్సులో ఉండవల్లి వరకు మంత్రి ప్రయాణించారు. ఈ సందర్భంగా మంత్రి మహిళా ప్రయాణికులతో ప్రభుత్వ పథకాల గురించి, స్త్రీ శక్తి పథకం గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. మహిళలను గౌరవించే ప్రభుత్వం కూటమి ప్రభుత్వం అన్నారు. ఆకాశంలో సగం అవనిలో సగం అంటూ మహిళలు కూటమి పాలనలో స్వేచ్ఛగా, స్వతంత్రంగా ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణించటం ఆనందంగా ఉందన్నారు. బస్ స్టేషన్ లో అవ్వని, అమ్మనీ, ఎవ్వరిని పలకరించినా ఆనందంతో ముఖ్యమంత్రి చంద్రబాబు కు జేజేలు పలుకుతూ, హృదయ పూర్వకంగా అభినందనలను అందిస్తున్నారన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఇటీవల ప్రారంభించిన స్త్రీ శక్తి ఉచిత బస్సు పథకం వల్ల మహిళలు ఎంతో ఆనందంతో బస్సుల్లో ప్రయాణించడం చూస్తుంటే ఎంతో ఆనందంగా కల్గుతుందన్నారు. సూపర్ సిక్స్ లో ఇప్పటికే ఉచితంగా 3 గ్యాస్ సిలిండర్లు, తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ, స్త్రీ శక్తి ఉచిత బస్సు పథకాలను అమలు చేయడం జరిగిందని, పెన్షన్ లను అందించడం జరుగుతుందన్నారు. రాష్ట్రంలో యువతకు 20 లక్షల ఉద్యోగాల కల్పనే ధ్యేయంగా పనిచేస్తున్నామన్నారు. మహిళలకు అన్ని రంగాల్లో ప్రాముఖ్యత ఇచ్చిన వ్యక్తి స్వర్గీయ మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారకరామారావు అని అన్నారు. మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకోవాలనే ఉద్దేశ్యంతో ఆస్తి హక్కు కల్పించారన్నారు. తదనంతరం అదే ఒరవడిని కొనసాగిస్తూ వచ్చిన వ్యక్తి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మహిళలకు రిజర్వేషన్లు కల్పించారన్నారు. గత ప్రభుత్వం ధరలను పెంచి పేదవాడిని పలు ఇబ్బందులకు గురిచేసిందన్నారు. మా ప్రభుత్వం పేద వారికి బాసటగా ఉంటూ అన్ని రంగాల్లో ముందుకు పోవాలనే ఉద్దేశ్యంతో వారికి అవకాశాలు కల్పిస్తున్నామన్నారు. స్త్రీ శక్తికి ఎదురులేదని వారు ఆర్థికంగా స్థిరపడే విధంగా వారికి అవకాశాలు కల్పిస్తామన్నారు. మహిళలకు అవకాశాలిస్తే అద్భుతాలు సృష్టిస్తారన్నారన్నారు. స్త్రీ శక్తి పథకం ద్వారా మహిళలకు నెలకు కనీసం రూ. 3,000 వరకు ప్రయాణ ఖర్చు ఆదా అవటంతోపాటు ఏడాదికి రూ. 36,000 ప్రయాణ ఖర్చు కలిసి వస్తుందన్నారు. కూటమి ప్రభుత్వం మహిళల సంక్షేమం కొరకు కృషి చేస్తోందన్నారు. అన్న క్యాంటీన్ల ద్వారా 5 రూపాయలకే భోజనం, టిఫిన్ అందిస్తున్నామన్నారు.

# ఆర్థిక అసమానతలు తొలగించేందుకే పి 4.

## మున్సిపల్ కమిషనర్ షేక్.ఫజులుల్లా

స్వర్ణ సాగరం (నాయుడుపేట) ఆగస్టు 20.

సమాజంలో ఆర్థిక అసమానతలు తొలగించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా పి 4 ను అమలు చేస్తుందని నాయుడుపేట మున్సిపల్ కమిషనర్ షేక్. ఫజులుల్లా తెలియజేశారు. బుధవారం ఆయన తన కార్యాలయంలో స్వర్ణకెరటాలు ప్రతినిధితో మాట్లాడారు. నాయుడుపేట మున్సిపాలిటీలో మార్గదర్శకుల సహకారంతో బంగారు కుటుంబాలను ఎంపిక చేయడం జరిగిందన్నారు.పి 4 పేదరిక నిర్మూలనకు ఎంతగానో దోహదం చేస్తుందన్నారు.

నాయుడుపేట మున్సిపాలిటీలో పి 4 సర్వే పూర్తి చేసామని తెలియజేశారు. నాయుడుపేట మున్సిపాలిటీలోని 25 వార్డుల్లోని13 సచివాలయాల పరిధిలో 1057 బంగారు కుటుంబాలకు గాను 1608 మంది సభ్యులను గుర్తించినట్లు తెలిపారు. అలాగే వారికి నైపుణ్య అభివృద్ధి పరంగా సహాయ సహకారాలు అందించేందుకు 166 మంది మార్గదర్శకులను ఎంపిక చేసినట్లు తెలిపారు.మేనకూరు సెజ్ లోని 13 పరిశ్రమల యాజమాన్యాలతో సమావేశం నిర్వహించి



మున్సిపాలిటీ పరిధిలోని 13 సచివాలయాల్లో ఉన్న బంగారు

కుటుంబాలను దత్తత తీసుకునేందుకు సహకరించాలని కోరినట్లు తెలిపారు.తాను చీమకుర్తి,రాజంపేట,అద్దంకి, మార్కాపురం,నెల్లూరు కార్పొరేషన్ నుడా,చీరాల, బాపట్ల,కావలి,ఆత్మకూరు మున్సిపాలిటీలో పనిచేసే విశిష్ట సేవలు అందించిన నేపథ్యంలో అనేక అవార్డులు అందుకోవడం జరిగిందని తెలియజేశారు.ఇరుకు గదుల్లో ఉన్న చీమకుర్తి, రాజంపేట,అద్దంకి,మార్కాపురం మున్సిపాలిటీ కార్యాలయాలకు తన పదవీకాలంలో అన్ని హంగులతో నూతన భవనాలు నిర్మించడం జరిగిందన్నారు.అలాగే ఇరుకు గదుల్లో శిథిలావస్థలో ఉన్న నాయుడుపేట మున్సిపాలిటీ భవనం కు నూతన భవనం ఏర్పాట్లు చేయడం కోసం ప్రణాళికలు సిద్ధం చేశామని తెలిపారు.పట్టణంలోని పాత తహసిల్దార్ కార్యాలయం ఆవరణలో మున్సిపల్ భవనానికి కేటాయించిన 43 సెంట్లు స్థలాన్ని స్వాధీనం చేసుకున్నామని తెలిపారు.తాము స్వాధీనం చేసుకున్న స్థలంలో ఉన్న పాత తాసిల్దార్ భవన శిధిలాలను తొలగిస్తున్నట్లు తెలియజేశారు. త్వరలో భవన నిర్మాణ పనులు చేపట్టి వీలైనంత త్వరగా అన్ని హంగులతో మున్సిపల్ కార్యాలయ భవన నిర్మాణాన్ని పూర్తి చేసేందుకు కృషి చేస్తామని తెలియజేశారు.

తిరుపతి

చిత్తూరు నెల్లూరు అనంతపురం

విలేకరులు కావలెను

సంప్రదించండి : 9440352036

# పేటమిట్టలో జాబ్ మేళాను ప్రారంభించిన పూతలపట్టు శాసనసభ్యులు మురళీమోహన్

## నిరుద్యోగులకు ఉద్యోగ కల్పనే కూటమి ప్రభుత్వం లక్ష్యం

ఐరాల, ఆగస్ట్ 20 స్వర్ణ సాగరం

ఐరాల,పూతలపట్టు మండలం, పేటమిట్ట గ్రామంలో ఏర్పాటు చేసిన జాబ్ మేళాను పూతలపట్టు శాసనసభ్యులు .డాక్టర్ కలికిరి మురళీమోహన్ ప్రారంభించారు. బుధవారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో పేటమిట్ట అమరరాజా స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ నందు నిర్వహించిన జాబ్ మేళా ప్రారంభోత్సవానికి ముఖ్య అతిధిగా హాజరైన స్థానిక ఎమ్మెల్యే మురళీమోహన్ ని స్థానిక నాయకులు, అమరరాజా ప్రతినిధులు, వివిధ కంపెనీల ప్రతినిధులు దుశ్శాలువలు, పూలమాలు వేసి ఘనంగా సత్కరించారు. అనంతరం ఎమ్మెల్యే జ్యోతి ప్రజ్వలన చేసి జాబ్ మేళా కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం జాబ్ మేళాలో పాల్గొనే కంపెనీ ప్రతినిధులతో ఎమ్మెల్యే మాట్లాడి విద్య, నైపుణ్యం తగినట్టు ఉద్యోగం కల్పించాలని వివిధ కంపెనీల ప్రతినిధులకు సూచించారు. ఈ జాబ్ మేళలో ఎంపికైన యువతే యువకులకు అపాయింట్మెంట్ ఆర్డర్స్ ను ఎమ్మెల్యే గారి చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పూతలపట్టు శాసనసభ్యులు మురళీమోహన్ మాట్లాడుతూ నిరుద్యోగులకు ఉద్యోగ కల్పనే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని ఆయన పేర్కొన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు రాష్ట్రంలోని యువత భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని రాష్ట్రానికి వివిధ కంపెనీలను తీసుకువచ్చేందుకు కృషి చేస్తూనే మరో వైపు జాబ్ మేళాలను నిర్వహించి నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నట్లు చెప్పారు. ఈ అవకాశాన్ని చదువుకున్న యువతీ, యువకులు సద్వినియోగం చేసుకొని ఉన్నత శిఖరాలు చేరుకోవాలని ఆయన ఆకాంక్షించారు. జాబ్ మేళాలో ఉద్యోగం పొందని నిరుద్యోగులకు కోసం







త్వరలోనే స్కిల్ డెవలప్మెంట్ శిక్షణ కల్పించి జాబ్ మేళాను నిర్వహిస్తామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో పూతలపట్టు నియోజకవర్గం పోల్ మేనేజ్మెంట్ కోఆర్డినేటర్ గిరిధర్ బాబు, బంగారుపాలెం మండల అధ్యక్షులు ఎన్ పి ధరణి నాయుడు, తవణంపల్లి మండలం అధ్యక్షులు వెంకటేష్ చౌదరి, బంగారు-పాలెం మార్కెట్ డైరెక్టర్ గురుస్వామి, పేటమిట్ట గ్రామ సర్పంచ్ గల్లా రాధాకృష్ణ నాయుడు మరియు అమర్ రాజా ప్రతినిధులు, వివిధ కంపెనీల ప్రతినిధులు, ప్రభుత్వ అధికారులు, యువతీ, యువకులు పాల్గొన్నారు.

# ఘనంగా నాయుడుపేట మున్సిపల్ మేనేజర్ ఉరుకుందమ్మ ఆధ్వర్యంలో కెక్ కటింగ్.

## మున్సిపల్ కమిషనర్ షేక్.ఫజులుల్లా జన్మదిన వేడుకలు.



స్వర్ణ సాగరం నాయుడుపేట ఆగస్టు.

నాయుడుపేట మున్సిపల్ కమిషనర్ షేక్ ఫజులుల్లా జన్మదిన వేడుకలు బుధవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ మేనేజర్ ఉరుకుందమ్మ ఆధ్వర్యంలో కార్యాలయ సిబ్బంది కమిషనర్ కు శాలువాలు కప్పి పూలమాలలు వేసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.అనంతరం కేక్ కట్ చేసి పంచిపెట్టారు.ఈ సందర్భంగా మున్సిపల్ మేనేజర్ ఉరుకుందమ్మ మాట్లాడుతూ నాయుడుపేట మున్సిపాలిటీని ఆదర్శవంతంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్న కమిషనర్ కు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ కార్యాలయ సిబ్బంది, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఐడిబిఐ బ్యాంక్ ధాత్రత్వంతో అన్నా స్వామి పల్లి పాఠశాల అభివృద్ధి

## కృతజ్ఞతలు తెలిపిన పాఠశాల కో ఆప్షన్ సభ్యులు జూలియన్ రాజు








రేణిగుంట స్వర్ణ సాగరం ఆగస్టు 20

రేణిగుంట మండలంలోని వెంకటాపురం పంచాయతీ లోని అన్నా స్వామి పల్లి జడ్పీ ఉన్నత పాఠశాల కు బుధవారం తిరుపతి ఐడిబిఐ బ్యాంక్ తరఫున 70000 విలువచేసే 13 టేబుల్ల ను ఏజీఎం శ్యాంప్రసాద్, బ్రాంచ్ హెడ్ రమేష్, మేనేజర్ బి.వి శరత్ ఉచితంగా అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రీజనల్ హెడ్ సాయి కృష్ణ ఆదేశాల మేరకు సిఎస్ఆర్ నిధులలో పాఠశాలకు తమ వంతు సహాయంగా ఈ కార్యక్రమం నిర్వహించామని అన్నారు. పాఠశాల కో ఆప్షన్ సభ్యులు జూలియన్ రాజు మాట్లాడుతూ తన మాటకు గౌరవం ఇచ్చి పాఠశాలకు సహాయం చేసిన బ్యాంక్ అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమం అనంతరం బ్యాంకు ఉద్యోగులను ఉపాధ్యాయులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు శోభ రాణి, శశి కళ, ముని మనోహర్, యాగయ్య, నాగమ్మ, నాగరాజ తదితరులు పాల్గొన్నారు

# “పోట్లపూడి పశు సహాయకులు షఫీ కి ‘రాష్ట్ర ‘పురస్కారం’

## విశిష్ట సేవలకు గుర్తింపు విజయవాడలో సన్మానం



తోటపల్లి గూడూరు స్వర్ణ సాగరం ఆగస్టు 20

మండలంలోని పోట్లపూడి పశు సహాయకులు షేక్ షఫీ ఉత్తమ సేవలకు గాను విజయవాడలో బుధవారం పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఉన్నత అధికారుల ద్వారా రాష్ట్ర పురస్కారం పొందారు ఈ సందర్భంగా ఆ శాఖ సంబంధిత అధికారులు షఫీని సన్మానించి అభినందించారు అతని సేవలను కొనియాడారు ఆగస్టు 15 స్వాతంత్ర్య వేడుకల సందర్భంగా షఫీ జిల్లా కలెక్టర్ నుంచి అవార్డులు తెచ్చుకోవడం గమనార్హం. పొట్లపూడి గ్రామంలో పశు సహాయకులుగా తన సేవలను అందిస్తూ రైతాంగం అభిమానంతో పాటు ప్రజా ప్రతినిధులు

పశుసంవర్ధక శాఖ వైద్యుల అభిమానం పొందారు. మూగజీవాలను సంరక్షించాలన్న సదుద్దేశంతో గాయపడిన ఓ పాముకు చికిత్స అందించి కాపాడడం ఆయన సేవా తత్పరతకు నిదర్శనం అలుపెరుగని రీతిలో సేవలు అందించడం షఫీ తన ఉద్యోగ ధర్మంతో పాటు సేవా తత్వం ఆయనకు కలిసి వచ్చిన అదృష్టంగా భావించవచ్చు. తనకు రాష్ట్ర పురస్కారం లభించడం పట్ల షఫీ సంతోషం వ్యక్తపరిచారు తనకు అవార్డు రావడంలో సహకరించిన అందరికీ ధన్యవాదాలు తెలిపారు ఈ అవార్డు లభించిన షఫీ ని పొట్లపూడి రైతాంగం అభినందనలు తెలియజేశారు

# మాజీ మంత్రి: కాకాణి ని అభినందించిన సీనియర్ వైకాపా నేత “చిల్లకూరు”




తోటపల్లి గూడూరు స్వర్ణ సాగరం ఆగస్టు 20

మాజీ మంత్రి సర్వేపల్లి నియోజకవర్గ మాజీ శాసనసభ్యులు కాకాణి గోవర్ధన రెడ్డి బుధవారంహైకోర్టు ఉత్తర్వుల ద్వారా బెయిల్ పై విడుదలైనారు.సీనియర్ వైకాపారాష్ట్ర నేతమాజీ ఏపీ డైరీ చైర్మన్ చిల్లకూరు సుధీర్ రెడ్డి ఆయనను కలిసిపూల గుచ్చంతో అభినందించి సత్కరించారు.ఈ అభినందన కార్యక్రమంలో సుధీర్ రెడ్డి తో పాటు మండల వైయస్సార్సీపి అధ్యక్షులు ఉప్పల శంకరయ్య గౌడ్ ఈదూరురామాచార్యులు తిరువల్లూరు ఈశ్వరయ్య లు ఉన్నారు

# గణనాథుని హుండీ ఆదాయం 1,67,32,780

## హుండీ లెక్కింపును పర్యవేక్షిస్తున్న ఆలయ ఈవో పెంచల కిషోర్



కాణిపాకం, ఆగస్టు 20 స్వర్ణ సాగరం

గణనాథుని హుండీ లెక్కింపును పర్యవేక్షిస్తున్న ఆలయ ఈవో పెంచల కిషోర్. కాణిపాకం శ్రీ వరసిద్ధి వినాయక స్వామివారి హుండీ లెక్కింపు ద్వారా 23 రోజులకు రాబడిన ఆదాయం 1,67,32,780 రూపాయలు,బంగారం 50 గ్రాములు,వెండి 1. కిలో 617 గ్రాములు,గో సంరక్షణ హుండీ ద్వారా 16,236 రూపాయలు.నిత్య అన్నదానం హుండీ ద్వారా - 41,450 రూపాయలు.ఫారిన్ కరెన్సీ యూఎస్ఏ 397. డాలర్స్ . ఇంగ్లాండ్ 10. పౌండ్స్. యూఏఈ 230. ధీరమ్స్ . కెనడ- 105. డాలర్స్. ఈ రో - 325. ఈ రో. ఆస్ట్రేలియా 70. డాలర్స్. సింగపూర్ 5. డోలర్స్. మలేషియా - 1. రింగ్గిట్స్ .ఆదాయం వచ్చినట్లు దేవస్థానం కార్యనిర్వాహణాధికారి పెంచల కిషోర్ తెలిపారు, ఈ హుండీ లెక్కింపులో పాల్గొన్నవారు, డి.ఈ.ఓ సాగర్ బాబు, చిత్తూరు జిల్లా అసిస్టెంట్ కమిషనర్ చిట్టెమ్మ, ఏఈఓలు - ఎస్వి కృష్ణారెడ్డి,రవీంద్రబాబు,హరిమాధవరెడ్డి, ప్రసాద్, ధనపాల్, సిఎఫ్ఓ నాగేశ్వరరావు, పర్యవేక్షకులు - కోదండపాణి, శ్రీధర్ బాబు, దేవస్థానం సిబ్బంది, సేవకులు, యూనియన్ బ్యాంక్ కాణిపాకం శాఖ, తదితరులు పాల్గొన్నారు.

స్వర్ణసాగరం



# చవటపాలెం పిఏసిఎస్ అధ్యక్షులుగా రావూరు



## ప్రమాణ స్వీకారం సందర్భంగా అభినందనలు

వెంకటాచలం స్వర్ణ సాగరం ఆగస్టు 20

మండలంలోని చవటపాలెం ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం అధ్యక్షులుగా రావూరు రాధాకృష్ణమనాయుడు బుధవారం ప్రమాణస్వీకారం చేశారుఅధికార బాధ్యతలు చేపట్టారు.డైరెక్టర్లుగా యనమల కృష్ణయ్య ఆస్తోటి నాగరాజు లు మండలంలోని సొసైటీ కార్యాలయంలోసంబంధిత శాఖ అధికారులు ప్రమాణ స్వీకారం చేయించారు.సర్వేపల్లి శాసనసభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి ప్రమాణ స్వీకార కార్యక్రమంలో పాల్గొని నూతన పాలకవర్గాన్ని అభినందించి శు భాకాంక్షలు తెలిపారు ఈ కార్యక్రమంలోసర్వేపల్లి నియోజకవర్గ టిడిపి సమన్వయకర్త రాజగోపాల్ రెడ్డి రైతులు అధికారులు పాల్గొన్నారు

# రైల్వే పెన్షనర్ల సమస్యలను పరిష్కరిస్తారన్న రైల్వే జనరల్ మేనేజర్



రేణిగుంట స్వర్ణ సాగరం ఆగస్టు 20

సౌత్ సెంట్రల్ రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీవాస్తవ్ మరియు గుంటకల్ డివిజన్ డివిజనల్ మేనేజర్ చంద్రశేఖర్ గుప్తా రేణిగుంట, తిరుపతి రైల్వే స్టేషన్ ల తనిఖీల నిమిత్తం విచ్చేసారు. ఈ సందర్భంగా రేణిగుంట రైల్వే పెన్షనర్స్ అసోసియేషన్(ఏ ఐ ఆర్ ఆర్ ఎఫ్) బ్రాంచ్ తరపున జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీవాస్తవ్ ని సన్మానించి పెన్షనర్ల సమస్యలపై వినతిపత్రం ఇవ్వడం జరిగింది. పెన్షనర్ల సమస్యపై ప్రత్యేక దృష్టి సారించాలని, పెన్షనర్ల కు మెరుగైన వైద్య సేవలు అందించాలని, వెల్ఫేర్ ఇన్స్పెక్టర్లు తరచుగా పెన్షన్ల సమస్యలను గురించి వారితో చర్చించాలని, పెండింగ్ లో ఉన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని సమస్యల వినతి పత్రంలో కోరడమైనది. జనరల్ మేనేజర్ వినతిపత్రాన్ని పరిశీలించి తగు చర్యలు తీసుకుంటామని తెలియచేసారు. ఈ కార్యక్రమంలో ఆల్ ఇండియా రిటైర్డ్ రైల్వే మెన్స్ ఫెడరేషన్ గుంతకల్ డివిజనల్ ప్రెసిడెంట్ డాక్టర్ గుమ్మడి జయంత్ కుమార్, రేణిగుంట బ్రాంచ్ చైర్మన్ అసన్ సాహెబ్, రేణిగుంట పంచాయతీ ప్రెసిడెంట్ ఆర్ నగేష్, నగర వెంకటరమణ, సి గురుమూర్తి, షమీముల్లా, అబ్దుల్ సలీం, జి రాజేంద్రప్రసాద్, బి రాజేంద్రన్, ఆర్ ఎస్ జ్ఞాన శేఖర్, ఏ రవీంద్రబాబు, సి జయశీలన్, యన్ జి మునికృష్ణ, పోసిన వెంకటేశ్వర్లు, షరీఫ్, తిమ్మారెడ్డి, టి సుబ్రహ్మణ్యం రెడ్డి, ఏ కామరాజు నాయుడు, మొదలైనవారు పాల్గొన్నారు.

# ఆలయానికి రెండు టీవీలు విరాళం



## ఆలయ ఈవో పెంచల కిషోర్ కి అందజేత

కాణిపాకం , ఆగస్టు 20 స్వర్ణ సాగరం

స్వామి వారి ఆలయానికి రెండు టీవీలు విరాళం. కాణిపాకం శ్రీ వరసిద్ధి వినాయక స్వామివారి ఆలయానికి సాంసంగ్ కంపెనీ 55" 2 టీవీలు విరాళం సుమారు విలువ 1,20,000 రూపాయలు, దాత చిత్తూరు విమ్సన్ అధినేత రవీంద్రనాథ్ , రమణ , వీరికి దర్శన ఏర్పాటు చేసి స్వామివారి తీర్థప్రసాదాలను అందజేసిన దేవస్థానం ఈ.వో పెంచల కిషోర్ , ఈ కార్యక్రమంలో సూపర్డెంట్ వాసు, టెంపుల్ ఇన్స్పెక్టర్ చిట్టిబాబు, ఏ.ఈ పవన్ తదితరులు ఉన్నారు.


# వైభవంగా ప్రదోషకాల పూజలు

కాణిపాకం ,ఆగస్టు 20 స్వర్ణ సాగరం



వైభవంగా ప్రదోషకాల పూజలు. కాణిపాకం శ్రీ వరసిద్ధి వినాయక స్వామివారి దేవస్థానం అనుబంధ దేవాలయమైన శ్రీ మణికంఠేశ్వర స్వామి వారి ఆలయము నందు బుధవారం సాయంత్రం ప్రదోషకాల పూజ సందర్భంగా వైభవంగా స్వామివారి మూలవిరాట్ మరియు నందీశ్వరుడుకి ఏకకాలంలో ప్రత్యేక అభిషేకములు, మరియు ప్రత్యేక పూజలు, ప్రత్యేక అలంకరణలు నిర్వహించడం జరిగింది, ఈ కార్యక్రమంలో అర్చకులు, వేద పండితులు, తదితరులు పాల్గొన్నారు.

# శ్రీసిటీని సందర్శించిన జపాన్-ఎహైమ్ రాష్ట్ర ప్రతినిధుల బృందం






## - వ్యాపార అవకాశాల పరిశీలన

శ్రీసిటీ,స్వర్ణ సాగరం ఆగస్టు 19, 2025:




ప్రముఖ ఎలక్ట్రిక్ వాహన తయారీ సంస్థ BEMAC జనరల్ మేనేజర్ తకాహిరో ఇన్నామి నేతృత్వంలో జపాన్‌లోని ఎహైమ్ రాష్ట్రానికి చెందిన నలుగురు సభ్యుల వ్యాపార ప్రతినిధి బృందం బుధవారం శ్రీసిటీని సందర్శించింది. శ్రీసిటీ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ (మార్కెటింగ్) ఆర్.శివశంకర్, అసిస్టెంట్ వైస్ ప్రెసిడెంట్ (బిజినెస్ డెవలప్‌మెంట్) బోడ్గన్ జార్జ్ ప్రతినిధి బృందానికి సాదర స్వాగతం పలికారు. శ్రీసిటీ ప్రపంచశ్రేణి మౌళిక సదుపాయాలు, రంగాలవారీ వైవిధ్యం, సుస్థిర ప్రణాళిక, వ్యాపార అనుకూలతలను వారికి వివరించారు. ఆంధ్రప్రదేశ్ పెట్టుబడిదారుల అనుకూల విధానాలను హైలైట్ చేస్తూ వేగవంతమైన అనుమతులు, రంగాలవారి నిర్దిష్ట ప్రోత్సాహకాలు, 'స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' తదితర అంశాల గురించి వెల్లడించారు.ఈ పర్యటనపై స్పందించిన శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి, శ్రీసిటీలో పరిశ్రమలు ఏర్పాటు చేయాలని ఎహైమ్ రాష్ట్ర పారిశ్రామికవేత్తలను సాదరంగా ఆహ్వానించారు. ఎహైమ్ కు చెందిన వ్యక్తిగత సంరక్షణ ఉత్పత్తుల తయారీ పరిశ్రమ యూనిచార్మ్ సహా 35 కు పైగా జపాన్ కంపెనీల ఏర్పాటుతో దేశంలో రెండవ అతిపెద్ద జపనీస్ పరిశ్రమల కేంద్రంగా శ్రీసిటీ అవతరించిందని పేర్కొన్నారు. శ్రీసిటీ వ్యాపారానుకూల వాతావరణం, జపనీస్ సంస్థలతో భాగస్వామ్యాన్ని ఇన్నామి ప్రశంసించారు. భారతదేశంలో ఎలక్ట్రిక్ ఆటో-రిక్షాలకు వున్న మార్కెట్ డిమాండ్ దృష్ట్యా, భారత్ లో కాలుష్యరహిత పర్యావరణ వ్యవస్థకు దోహదపడే రంగంలో పెట్టుబడులు పెట్టేందుకు BEMAC ఆసక్తిని వ్యక్తం చేసింది.ఈ ఏడాదిలో రెండవ పర్యాయం ఎహైమ్ వ్యాపారవేత్తల బృందం శ్రీసిటీ పర్యటనకు రావడం శ్రీసిటీలో వ్యాపార నిర్వహణ పట్ల జపాన్ సంస్థల ఆసక్తిని తెలియచేయడంతో పాటు ఇండో-జపనీస్ ఆర్థిక సహకారాన్ని మరింత బలోపేతం చేస్తుంది.

# యాజమాన్య పద్ధతుల పాటించాలి



పెళ్లకూరు స్వర్ణసాగరం ఆగస్టు20.



రబీ సీజన్లో వరి సాగు చేపట్టే రైతులు నూతన వ్యవసాయ విధానంలో భాగంగా యాజమాన్య పద్ధతులు పాటించడం వల్ల అధిక దిగుబడులు పొందవచ్చని వ్యవసాయ శాఖ ఏడిఏ నాగార్జునసాగర్ వెల్లడించారు. బుధవారం చెంబెడు, నెలబల్లి గ్రామాల్లో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించి రైతులకు ఆధునిక వ్యవసాయ విధానాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ ఈ - పంట ప్రాముఖ్యతను రైతులకు తెలియజేశారు. రైతులనుఅందరూ తప్పని సరిగా ఈ- పంట నమోదు చేసు కోవాలని, ప్రభుత్వ పథకాలకు ఈ - పంట నమోదు తప్పనిసరి అని తెలియజేశారు. పచ్చిరొట్ట ఎరువుల ప్రా ముఖ్యతను, రబీ సీజన్ లో మేలైన వరి వంగడాలు గూర్చి రైతులకు తెలియజేశారు. సాగు పనులకు ముందుగా రైతు లందరూ భూసార పరీక్షలు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్ర మంలో మండల వ్యవసాయ శాఖ అధికారి విజయభారతి, ఇరు గ్రామాల రైతులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

# మున్సిపల్ కమిషనర్ షేక్ ఫజులుల్లా కు జన్మదిన శుభాకాంక్షలు.



## టిడిపి నాయకులు మున్సిపల్ కాంట్రాక్టర్ నాగిరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి.

స్వర్ణసాగరం(నాయుడుపేట)ఆగస్ట్ 20.

తిరుపతి జిల్లా నాయుడుపేట మున్సిపల్ కమిషనర్ షేక్ ఫజులుల్లా మాజీ ఏఎంసి డైరెక్టర్,టిడిపి నేత నాగిరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.బుధవారం నాయుడుపేట మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ ఫజులుల్లా ను నాగిరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కమిషనర్ కు శాలువా కప్పి,సన్మానించి,జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. మున్సిపల్ కమిషనర్ షేక్ ఫజులుల్లా నిండు నూరేళ్లు ఆయుర్వేగాలు,సుఖ సంతోషాలతో ఆనందంగా జీవిస్తూ నాయుడుపేట మున్సిపాలిటీని ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలని నాగిరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి కోరారు.

# మున్సిపల్ కమిషనర్ షేక్ ఫజులుల్లా కు జన్మదిన శుభాకాంక్షలు..



## గూడూరు కిషోర్ కుమార్

స్వర్ణ సాగరం (నాయుడుపేట) ఆగస్టు 20.

నాయుడుపేట మున్సిపల్ కమిషనర్ షేక్ ఫజులుల్లా తిరుపతి జిల్లా రూరల్ ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులు గూడూరు కిషోర్ కుమార్ జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.బుధవారం నాయుడుపేట మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ ఫజులుల్లా ను ఆర్యవైశ్య సంఘం నాయకుల తోపాటు మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా కమిషనర్ కు శాలువా కప్పి,సన్మానించి,పూల మొక్క అందజేసి,జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.ఆయన నిండు నూరేళ్లు ఆయుర్వేగాలు,సుఖ సంతోషాలతో ఆనందంగా జీవిస్తూ, నాయుడుపేట మున్సిపాలిటీ ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలని కోరారు.పట్టణంలో పారిశుధ్యాన్ని మెరుగుపరిచేందుకు కమిషనర్ అవిరళ కృషి చేస్తున్నారని కొనియాడారు.అలాగే పట్టణంలో ప్లాస్టిక్ నియంత్రణకు ప్రణాళిక బద్ధంగా సిబ్బందిని ప్రోత్సహించి పనిచేస్తున్నారని తెలిపారు.కమిషనర్ తన పదవీకాలంలో నాయుడుపేటలో నూతన మున్సిపల్ కార్యాలయ భవనాన్ని నిర్మించాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో తిరుపతి జిల్లా రూరల్ ఆర్యవైశ్య సంఘం ప్రధాన కార్యదర్శి గాదంశెట్టి నాగరాజు,ఉపాధ్యక్షులు కొనిజేటి వెంకటేశ్వర్లు బాబు, అధికార ప్రతినిధి గూడూరు కిరణ్ కుమార్,కార్యవర్గ సభ్యులు సీతా శ్రీధర్,నీలి శెట్టి వంశీకృష్ణ,సత్రశాల మునిరాజా తదితరులు పాల్గొని కమిషనర్ కు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.

# పెన్షన్ తొలగింపుపై అధికారులతో సమీక్ష నిర్వహించిన పూతలపట్టు శాసనసభ్యులు మురళీమోహన్

### అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి పెన్షన్ చేరేవరకు నిరంతర పర్యవేక్షణ కొనసాగిస్తా మురళీమోహన్

ఐరాల, ఆగస్ట్ 20 స్వర్ణ సాగరం

ఐరాల,పూతలపట్టు నియోజకవర్గంలో పెన్షన్ తొలగింపుపై పూతలపట్టు నియోజకవర్గం అధికారులతో పూతలపట్టు శాసనసభ్యులు మురళీమోహన్ సమీక్ష సమావేశం నిర్వహించారు. బుధవారం చిత్తూరు లక్ష్మీనగర్ కాలనీలోని పూతలపట్టు శాసనసభ్యులు కార్యాలయంలో పూతలపట్టు శాసనసభ్యులు.డాక్టర్ కలికిరి మురళీమోహన్ పీడీ మరియు నియోజకవర్గ ఎంపీడివోలతో సమావేశమై పెన్షన్ల తొలగింపు పై వివరాలు అడిగి తెలుసుకున్నారు. అర్హత ఉండి పెన్షన్ తొలగిన వారి జాబితా అర్హత లేకున్నా పెన్షన్ పొందుతున్న వారిపై సమగ్ర విచారణ జరిపి నివేదిక సమర్పించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా పూతలపట్టు శాసనసభ్యులు మురళీమోహన్ మాట్లాడుతూ అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి పెన్షన్ అందేలా తక్షణ చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ప్రజల హక్కుల విషయంలో అధికారులు ఎలాంటి నిర్లక్ష్యం వహించవద్దని అధికారులను హెచ్చరించారు. పూతలపట్టు నియోజకవర్గంలో అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి పెన్షన్ చేరే వరకు నిరంతర పర్యవేక్షణ కొనసాగిస్తాను అని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో పూతలపట్టు నియోజకవర్గం నాయకులు, ప్రభుత్వ అధికారులు పాల్గొన్నారు.



# విద్యార్థులకు స్కూల్ బ్యాగులు పంపిణీ చేస్తున్న మండల విద్యాశాఖ అధికారిణి హేమలత

స్వర్ణసాగరం తవణంపల్లి ఆగస్టు-20

చిత్తూరు జిల్లా తవణంపల్లి మండలం పొగాకు నియంత్రణలో భాగంగా జులై 1 నుండి జులై 21 వరకు అత్యధిక సంఖ్యలో సంతకాలు సేకరించిన విద్యార్థులకు మండల విద్యాశాఖ అధికారిణి హేమలత పాఠశాల బ్యాగులు పంపిణీ చేశారు. వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో 7, 8,9 తరగతుల విద్యార్థులకు పొగాకు వ్యతిరేక సంతకాల సేకరణ బాధ్యతలు అప్పజెప్పారు. ఈ విద్యార్థులు పొగాకు వ్యతిరేక సంతకాల సేకరణ, పొగాకు నియంత్రణకు చేపట్టాల్సిన చర్యలపై ప్రతిజ్ఞను ప్రజలకు తెలియచేసి సంతకాలు సేకరించారు. సేకరించిన సంతకాలను పరిశీలించి ఎవరైతే ఎక్కువ సంతకాలు సేకరించారో ప్రతి మండలం నుండి మొదట వచ్చిన ముగ్గురు విద్యార్థులను ఎంపిక చేశారు. వీరిలో మొదటి బహుమతి కె మోనిత్ సాయి ఆచారి 7వ తరగతి, రెండవ బహుమతి టి మహేందర్ 8 వ తరగతి జడ్పీ హైస్కూల్ తొడతర, మూడవ బహుమతి ఈ పి. సాహిత్ కుమార్ రెడ్డి 9 వ తరగతి జడ్పీ హైస్కూల్ తవణంపల్లి వీరికి ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ సమకూర్చిన పాఠశాల బ్యాగులు బహుకరించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారిణి, హేమలత పాఠశాల ఉపాధ్యాయులు సిపి సుధాకర్ రెడ్డి, ఆర్ లవన్ కుమార్ రెడ్డి, సిఆర్ఎంటి గోపి, వైద్య ఆరోగ్యశాఖలో పనిచేస్తున్న పొగాకు నియంత్రణ సామాజిక కార్యకర్తలు టి. లావణ్య, బి. శిల్ప పాల్గొన్నారు.



# ప్రకృతి వ్యవసాయం లాభదాయకం



స్వర్ణ సాగరం ఓజిలి ఆగష్టు 20:

ప్రకృతి వ్యవసాయం లాభదాయకమని ప్రకృతి వ్యవసాయం ఓజిలి రీఛార్జ్ జైతున్ బీ పేర్కొన్నారు. మండలంలోని చిలమానుచేను గ్రామంలో రీచా ఆర్గనైజేషన్ సంస్థ ఏ ఎమ్ మిథున్ జీ, ఆంధ్రప్రదేశ్ ఏ యమ్ హేమంత్ సూపర్ వైజర్ పాపారావు ఆధ్వర్యంలో చిలమానుచేను గ్రామంలో ప్రకృతి వ్యవసాయ పొలాలను బుధవారం పరిశీలించడం జరిగింది.

ఫీల్డ్ విజిటింగ్ చేయించడం ఇన్ ప్రీపరేషన్ చేయడంతో లైవ్ చూపించి వారికి వివరించడం జరిగింది. ఈళకార్యక్రమంలో రీచా ఆర్గనైజేషన్ స్టాఫ్ పిసి దస్తగిరి, శ్రీనివాసులు, కోటేశ్వరరావు, గిరి, శివ,మాధవిప్రకృతి వ్యవసాయ సిబ్బంది చెంచమ్మ, శ్రావణి, గురవయ్య రైతులు, మండలం ఇన్చార్జి జైతున్ బీ తదితరులు పాల్గొన్నారు.

# నలగాంపల్లి సబ్ స్టేషన్ నందు అదనపు ట్రాన్స్ఫార్మర్ ప్రారంభం





బంగారుపాళ్యం.స్వర్ణసాగరం.ఆగస్టు 20

చిత్తూరు జిల్లా పూతలపట్టు నియోజకవర్గం బంగారుపాళ్యం మండల పరిధిలోని నలగాంపల్లి పంచాయతీలోని లూకాస్ పురం పెట్రోల్ బంక్ ఎదురుగా ఉన్న సబ్ స్టేషన్ నందు అదనపు ట్రాన్స్ఫార్మర్ ను చిత్తూరు ఎస్ ఇ ఇస్మాయిల్అహ్మద్ విద్యుత్ సిబ్బందితో బుధవారం ప్రారంభించారు ఈ సందర్భంగా ఎస్ ఇ ఇస్మాయిల్ అహ్మద్ మాట్లాడుతూ, నల్లగాంపల్లి సబ్ స్టేషన్ పరిధిలోని గ్రామాలు నలగాంపల్లి,తుమ్మోజి పల్లి,బోమ్మాయిపల్లి, కరిడివారిపల్లి,మామిడి పరిశ్రమలకు మెరుగైన విద్యుత్తును అందించేందుకు అదనపు ట్రాన్స్ఫార్మర్ ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. అనంతరం సబ్ స్టేషన్ పరిధిలో మొక్కలను నాటారు.ఈ కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ మునిచంద్ర,ఈఈటిఆర్ఇ బాబు,బంగారుపాళ్యం ఏఈ దేవి ప్రసన్న,టిఆర్ ఈఏఈ హేమచంద్ర, ప్రొటెక్షన్ ఏఈ సోమరాజు, ఎల్ ఐ రవి,శివాజీ, విద్యుత్ శాఖ సిబ్బంది పాల్గొన్నారు

# నాయుడుపేటలో ఆకస్మిక తనిఖీలు.



### మున్సిపల్ కమిషనర్ షేక్ ఫజులుల్లా

స్వర్ణ సాగరం (నాయుడుపేట) ఆగస్టు 20.

తిరుపతి జిల్లా నాయుడుపేట మున్సిపల్ పరిధిలో మున్సిపల్ కమిషనర్ షేక్ హస్బల్లా ఉదయం నాయుడుపేటలో ఆకస్మిక తనిఖీలు చేశారు. నాయుడుపేట లోని ఇండియన్ బ్యాంక్ వద్దగల తిరుమల డైరీ షాప్ లో ప్లాస్టిక్ కవర్లను సీజ్ చేసి, ప్లాస్టిక్ వాడుతున్నందుకు ఆ షాపు యాజమాన్యానికి ప్లాస్టిక్ వల్ల కలిగే నష్టాలను నాయుడుపేట మున్సిపల్ కమిషనర్ షేక్ పజుల్లుల్ల తెలియజేశారు.నాయుడుపేటలోని పలు షాపులలో రైడ్ చేయడం జరిగిందని షాపులలో ప్లాస్టిక్ కవర్లు వాడడం షాప్ కు వచ్చిన కస్టమర్లకు వాటిని అందజేయడం సరికాదని ఎట్టి పరిస్థితుల్లో ప్లాస్టిక్ కవర్లను వాడుతున్న షాపులను వాటి లైసెన్సులను రద్దు చేసే పరిస్థితి షాపు యాజమాన్యాలు తీసుకురావద్దని నాయుడుపేట మున్సిపల్ కమిషనర్ షేక్. ఫజులుల్లా తెలియజేశారు

# రైతు సేవా కేంద్రాలలో రైతులకు గ్రామ సభనిర్వహించిన జాయింట్ కలెక్టర్ రాజేంద్ర పటేల్



స్వర్ణసాగరం తవణంపల్లి ఆగస్టు-20

తవణంపల్లి మండల రైతు సేవ కేంద్రాలలో రైతులకు జాయింట్ కలెక్టర్ రాజేంద్ర పటేల్ అద్వర్యం లో గ్రామసభ నిర్వహించడం జరిగింది. టీ పుత్తూరు మరియు పుణ్య సముద్రం రైతు సేవ కేంద్రాల ద్వారాగుజ్జు పరిశ్రమకు మామిడి కాయలు తొలిన రైతుల జాబితా పరిశీలన కొరకు గ్రామ సభ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ రాజేంద్ర పటేల్ తహసిల్దార్ సుధాకర్ పాల్గొని ఈ సందర్భంగా రైతుల జాబితాను రైతుల ముందు చదివి వినిపించడం జరిగింది. రైతులు ఈప్పటికైనా ఏవైనా పొరబాట్లు ఉంటే సరిదిద్దు కోవాలని కాటా, బ్యాంకుపేరు, బ్యాంకు ఖాతా నెంబర్, బాంక్ ఐ.ఎఫ్.ఎస్.సి సంఖ్య ఇతర వివరాలు సక్రమంగా ఉన్నాయో లేవో సరిచూసుకోవాలి, ఇంకా 2 రోజుల రైతుసేవా కేంద్రాల నందు జాబితా ఉంటుంది అని అందరూ రైతులు సరిచూసుకోవాలి. ఏదైనా తప్పులు ఉంటే సరిచేస్తామని కలెక్టర్ గారి ఆధ్వర్యంలో తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో టీ పుత్తూరు సర్పంచ్ రవి రెడ్డి పుణ్యసముద్రం సర్పంచ్, రెవెన్యూ సిబ్బంది మరియు రైతుసేవా కేంద్ర సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

# మున్సిపల్ కమిషనర్ షేక్ ఫజులుల్లా కు జన్మదిన శుభాకాంక్షలు..



### పోలేరమ్మ ఆలయ కమిటీ చైర్మన్ నానబాల సుబ్బారావు

స్వర్ణ సాగరం(నాయుడుపేట) ఆగస్టు 20.

నాయుడుపేట మున్సిపల్ కమిషనర్ షేక్ ఫజులుల్లా కు శ్రీ పోలేరమ్మ ఆలయ కమిటీ చైర్మన్ నానబాల సుబ్బారావు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.బుధవారం నాయుడుపేట మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ ఫజులుల్లా ను నానబాల సుబ్బారావు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కమిషనర్ కు శాలువా కప్పి,సన్మానించి,జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. మున్సిపల్ కమిషనర్ షేక్ ఫజులుల్లా నిండు నూరేళ్లు ఆయుర్వేగాలు,సుఖ సంతోషాలతో ఆనందంగా జీవిస్తూ నాయుడుపేట మున్సిపాలిటీని ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న తెలుగుదేశం పార్టీ నాయకులు మల్లాం రవికుమార్,ఆబోతుల బాబు కమిషనర్ కు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.

# కాంగ్రెస్ అంటే అభివృద్ధి సంక్షేమం

**జిల్లా ఉపాధ్యక్షులు బత్తుల శ్రీనివాస్ యాదవ్**



స్వర్ణ సాగరం డోర్నకల్ ఆగస్టు

కాంగ్రెస్ పార్టీ అంటేనే అభివృద్ధి సంక్షేమం అని జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు డాక్టర్ బత్తుల శ్రీనివాస్ యాదవ్ అన్నారు. ప్రభుత్వ విప్ డిప్యూటీ స్పీకర్ ఎమ్మెల్యే డాక్టర్ రామచంద్రనాయక్ ఆదేశాల మేరకు బుధవారం డోర్నకల్ మండలంలోని చిలుకోడు గ్రామంలో ఇందిరమ్మ పల్లె ప్రగతి యాత్ర ను నిర్వహించారు.. ప్రజా ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. రానున్న స్థానిక ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. అనంతరం పలువురికి మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందించారు. ఈ కార్యక్రమం లో డోర్నకల్ మండల పార్టీ అధ్యక్షులు జగదీష్, మండల మహిళా అధ్యక్షులు పసుపులేటి కళావతి, డోర్నకల్ బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కాసం శేఖర్, మండల నాయకులు అంగోత్ వెంకన్న, మండల ఉపాధ్యక్షులు పగడాల మధు, మాజీ సర్పంచ్ రాయల వెంకటబాబు, చిలుకోడు గ్రామ పార్టీ అధ్యక్షులు బండి ఉదయ్, చిలుకోడు కాంగ్రెస్ పార్టీ నాయకులు మిట్టకోలా నగేష్, ఆకునూరి సురేష్, అవనగంటి నగేష్, అవనగంటి సతీష్, అంబటి శ్రీను, జోగి మహేష్, వేముల సురేష్,తురక రమేష్,గౌని మహేష్,వల్లెపు వీరన్న,భాషపొంగు ప్రవీణ్, ప్రవీణ్, బడేటి సాయి, తెలురీ నవీన్,గోరు లక్ష్మి నారాయణ, లంజపల్లి కొమరయ్య, గుడిపాటి బిక్షపతి,వివిధ గ్రామపార్టీ అధ్యక్షులు కాంగ్రెస్ పార్టీ యూవజన నాయకులు కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు పాల్గొన్నారు

# శ్రీకాళహస్తి నియోజకవర్గంలో వికలాంగుల పెన్షన్ల పునరుద్ధరణ కోసం సిపిఐ డిమాండ్



స్వర్ణ సాగరం శ్రీకాళహస్తి రూరల్

శ్రీకాళహస్తి నియోజకవర్గంలో కూటమి ప్రభుత్వం తొలగించిన వికలాంగుల పెన్షన్లను తక్షణమే పునరుద్ధరించాలని సిపిఐ పార్టీ నియోజకవర్గ కార్యదర్శి జనమాల గురవయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా అంబేద్కర్ విగ్రహం వద్ద సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. వికలాంగుల పట్ల కూటమి ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తూ, వారికి అందజేస్తున్న పెన్షన్లను తొలగించడం అమానుషమని ఆయన అన్నారు. గతంలో తెలుగుదేశం పార్టీ ప్రభుత్వ హయాంలో అందజేస్తున్న పెన్షన్లను కూడా తొలగించడం దారుణమని ఆయన పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం తన నిర్ణయాన్ని పునఃపరిశీలించి, వికలాంగుల పెన్షన్లను పునరుద్ధరించాలని ఆయన డిమాండ్ చేశారు. లేని పక్షంలో బాధితులతో కలిసి ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ పట్టణ కార్యదర్శి రోడ్డ గోపి, పట్టణ నాయకులు మురళి, జనార్ధన్, మునిరాజా, మహిళా సంఘం నాయకులు మునెమ్మ, గంగమ్మ పాల్గొన్నారు.

# శ్రీ పల్లికొండేశ్వర స్వామి దేవస్థానంలో ప్రదోష పూజలు



నాగలాపురం -స్వర్ణ సాగరం ఆగస్టు 19:

నాగలాపురం మండలం సురుటుపల్లి గ్రామంలో వెలిసి ఉన్న శ్రీ సర్వమంగళ సమేత శ్రీ పల్లికొండేశ్వర స్వామి దేవస్థానంలో బుధవారం ప్రదోష పూజలు నిర్వహించారు. ఈ ప్రదోషం సందర్భంగా శ్రీ నందీశ్వర స్వామికి,శ్రీ వాల్మీకేశ్వర స్వామి వారికి ఏకకాలంలో ప్రదోష పూజలు నిర్వహించారు. అభిషేకం అనంతరం స్వామి అమ్మవార్లను,ప్రదోష నందీశ్వర స్వామిని వివిధ పుష్పాలతో సుందరంగా అలంకరించి ధూప దీప నైవేద్యములు,మహాదీపారాధనలు నిర్వహించారు. ఈ ప్రదోష పూజలకు ప్రసాదం ఉభయదారులుగా నింద్రకు చెందిన శ్రీనివాస్ మిల్క్ ప్రైవేట్ లిమిటెడ్ ఉభయ దారులుగా వ్యవహారించారు. వారికి ఆలయ కార్యనిర్వహణాధికారిణి పి.లత ఆలయ మర్యాదలతో దర్శనం ఏర్పాట్లు చేసి స్వామి వారి ప్రసాదములు అందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

# వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గా బాధ్యతలు చేపట్టిన పాలపర్తి వెంకటేశ్వర్లు.





కనిగిరి స్వర్ణ సాగరం ఆగస్టు 20

వ్యవసాయ మార్కెట్ వైస్ చైర్మన్ గా పాలపర్తి వెంకటేశ్వర్లుని నియమించిన శాసనసభ్యులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహ రెడ్డి ని అమరావతి గ్రౌండ్ వారి క్యాంపు కార్యాలయం కాపుసంఘం నాయుకులు వారికీ కృతజ్ఞతలు తో చిరు సత్కారం చేసారు. పామూరు కాపు కులాన్ని కి చెందిన పాలపర్తి వెంకటేశ్వర్లు కు ఇవ్వడం ఎంతో సంతోషకరమైన విషయం అని అన్నారు. ఎమ్ ఎల్ ఏ ఆశీస్సులతో నాకు ఏ ఎమ్ సి వైస్ చైర్మన్ గా నియమించారు. ఎమ్ ఎల్ ఏ ఉగ్ర అన్నకు విధేయుడు గా నాకు అప్పగించినబాధ్యతలు సక్రమంగా నిర్వహిస్తానని తన పై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయను తెలియచేశారు . వ్యవసాయ మార్కెట్ కార్యాలయం నందు సిబ్బంది తో మాట్లాడి వారికి సూచనలు సలహాలు ఇవ్వడం జరిగింది. సిబ్బంది కి చిరు కనుకుగా వస్త్రాలు బహుమతి గా పాలపర్తి రమా దేవి వెంకటేశ్వర్లు ఇచ్చారు. ఈ కార్యక్రమం లో మిత్రలు శ్రేయోభిలాషులు కనిగిరి తెలుగు యువత అధ్యక్షుడు తడిక మల్ల సుబ్బారావు, కాపు సంఘం నాయకులు ముకుందా ధనలక్ష్మి నరసింహులు, నామ పుల్లయ్య నామ పార్వతి, నారపు శెట్టి నరసయ్య,,పామూరు మండలానికి చెందిన లక్ష్మి నరసాపురం మాజీ ఎమ్ పి టి సి పాలపర్తి రమాదేవి, రావి గుంటపల్లి గ్రామ కమిటీ అధ్యక్షులు కంచర్ల శ్రీను, తూర్పు కట్ట కిందపల్లి గ్రామ కమిటీ అధ్యక్షులు పెద్ది శెట్టి శ్రీనివాసులు, టీడీపీ కుటుంబ మహిళ నాయుకులు తదితరులు పాల్గొన్నారు.

# నవజీవన్ ఆర్గనైజేషన్ సిసిపియు ఆధ్వర్యంలో హెచ్.ఐ.వి మరియు ఎయిడ్స్ పై అవగాహన

**నవజీవన్ సి సి పి యు మేనేజర్ కే.బాలాజీ.**

స్వర్ణ సాగరం (నాయుడుపేట) ఆగస్టు 20.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ ఆదేశముల మేరకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ,జిల్లా ఎయిడ్స్ నివారణ మరియు నియంత్రణ విభాగం సహకారంతో ఈరోజు నవజీవన్ ఆర్గనైజేషన్ -సి.సి- పి.యు- ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో " ఇంటెన్సిఫైడ్ ఐ.ఇ.సి క్యాంపెయిన్" కార్యక్రమం ద్వారా హెచ్.ఐ.వి/ఎయిడ్స్ పై అవగాహన సదస్సును నాయుడుపేట లోని "డా.సి.వి.రామన్ డిగ్రీ కళాశాల " నందు నిర్వహించడం జరిగింది . ఈ కార్యక్రమములో భాగముగా ప్రాజెక్ట్ మేనేజర్ అయిన కె. బాలాజి మాట్లాడుతూ, హెచ్.ఐ.వి/ఎయిడ్స్ వ్యాప్తి కారకాలు, ఎలా వ్యాపించదు, హెచ్.ఐ.వి/ఎయిడ్స్ లక్షణాలు, అవి రాకుండా ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలి, హెచ్.ఐ.వి/ఎయిడ్స్ వ్యాధిగ్రస్తుల పట్ల వివక్షత చిన్న చూపు లేకుండా ఎలాగా సమాజములో కలసి జీవించాలి, హెచ్.ఐ.వి/ఎయిడ్స్, క్షయ వ్యాధి సంబందం గూర్చి, సుఖ వ్యాధులు మరియు చికిత్స గూర్చి,కండోమ్ యొక్క ఉపయోగము గూర్చి, హెచ్.ఐ.వి/ఎయిడ్స్ ఏక్ట్ 2017, ఎ.ఆర్.టి మందులు, ఏ.పి.శాక్స్ యాప్ ,టోల్ ఫ్రీ




నెంబర్ 1097 గూర్చి తెలుపుతూ, మీ ద్వారా తెలియని వాళ్లకు తెలియజేయమని చెప్పడం జరిగింది. ఈ కార్యక్రమం లో కళాశాల ప్రిన్సిపాల్ జి.వి.వి. గోపాల్, ఎ.ఓ యమ్. వెంకటేశ్వర్లు, లెక్చరర్ బి. హెూలీ క్రిష్ణ, ఓ.ఆర్.డబ్ల్యూలు - యమ్. సాయిలక్ష్మీ, టి. శ్రావణి, ఎ.యన్.యమ్- జి. శ్రీ లత, పి.ఇ లు మరియు 120 మంది విద్యార్థులు పాల్గొనడం జరిగింది. తదుపరి తుమ్మూరు ఏరియా లో హెచ్.ఐ.వి/ఎయిడ్స్ పై అవగాహన కల్పించడం కోసం మీటింగ్ మరియు ర్యాలీ నిర్వహించడం జరిగింది. ఈ ర్యాలీలో 65 మంది ప్రజలు పాల్గొని విజయవంతం చేయడం జరిగింది. వీరిలో 14 మంది ప్రజలుకు నవజీవన్ సంస్థ ఎ.యన్.యమ్ ద్వారా హెచ్.ఐ.వి పరీక్షలు చేయించి వారి స్థితిని వారికి తెలియజేయడం జరిగింది.

# పూతలపట్టులోప్రపంచ దోమల దినోత్సవ ర్యాలీ



పూతలపట్టు స్వర్ణ సాగరం ఆగస్టు 20

ప్రపంచ దోమల దినోత్సవము సందర్భంగా పూతలపట్టు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం లో వైద్యాధికారి డాక్టర్ వినయ్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో ర్యాలీ జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దోమ కాటు వల్ల ప్రాణాంతకమైన జబ్బులు ప్రజల్లో వస్తున్నదని గుర్తించి ఈ దోమల నివారణ దినోత్సవాన్ని జరుపుకుంటున్నామన్నారు. ప్రతి ఏటా ఆగస్టు 20వ తేదీన ప్రపంచ దోమల దినోత్సవాన్ని జరుపుకుంటున్నామని దీన్ని ప్రధానోద్దేశం దోమ పుట్టకుండా- కుట్టకుండా చూసుకుంటే వాటి వల్ల వచ్చే జబ్బుల నుండి ప్రజలను కాపాడవచ్చు అన్నారు. ప్రాణాంతకమైన మలేరియా, డెంగ్యూ, చికెన్ గునియా, బోదకాలు, మెదడు వ్యాపు జ్వరాలు దోమ కాటు వల్ల సంభవిస్తుందన్నారు. వీటిని నివారించే క్రమంలో భాగంగానే ప్రజలకు దోమల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించాల్సిన బాధ్యత వైద్య ఆరోగ్య శాఖ పై ఉందన్నారు. వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలను కూడా పరిశుభ్రంగా ఉంచుకు నప్పుడే దోమల వ్యాప్తిని అరికట్టవచ్చని డాక్టర్ వినయ్, సిహెచ్ఓ లక్ష్మీనారాయణలు పేర్కొన్నారు. ర్యాలీ అనంతరం ప్రతిజ్ఞ చేశారు. ఈకార్యక్రమంలో ఎంపీ హెచ్ ఈ ఓ హెచ్ ఎస్ దర్మేంద్ర ఎం ఎల్ హెచ్ పి ఎస్ ఏ ఎన్ ఎం ఎస్ మరియు అశా వర్కర్లు పాల్గొన్నారు

# మాదకద్రవ్యల ప్రభావం పై అవగాహనా కల్పిస్తున్న -టూ టౌన్ సిఐ నాగార్జున రెడ్డి,



స్వర్ణ సాగరం- శ్రీకాళహస్తి

అఖిల భారత విద్యార్థి సమైక్య ఏఐఎస్ఎఫ్ తిరుపతి జిల్లా సహాయ కార్యదర్శి కొగిలి ముని చందు ఆధ్వర్యంలో డ్రగ్స్ వంటి మాదక ద్రవ్యాల ప్రభావం విద్యార్థులపై ఏ విధంగా ఉంది ప్రస్తుత సమాజంలో ఇటువంటివి ఎంతవరకు విస్తరించాయి వీటి వాడకం వల్ల కలిగే నష్టాలు ఏంటి అనే విషయంపై శ్రీకాళహస్తి ఎస్సీ బాయ్స్ హాస్టల్ లో ఒక సమావేశం ఏర్పాటు చేసి విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా టూ టౌన్ సీఐ నాగార్జున రెడ్డి హాజరయ్యారు అనంతరం అయిన మాట్లాడుతూ.. నేడు యువతరం మొత్తం ఇటువంటి మాదకద్రవ్యాల చేతిలో కట్టు బానిసలు అవుతున్నారు. వీటి వాడకంతో మతిస్థిమితం లేకుండా చేయరాని తప్పులు చేస్తూ నేరస్తులు అవుతున్నారు. వీటి వాడకం వల్ల చిన్నతనంలోనే ప్రాణాలు సైతం కోల్పోతూ తల్లిదండ్రులకు చెరగని మచ్చ తీసుకువస్తున్నారు అన్నారు. విద్యార్థి దశలోనే తమ బంగారు భవిష్యత్తును ఎటువైపు తీసుకువెళ్లాలో ఆలోచించి బాగా చదువుకుని సమాజానికి తమ తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాల్సిన విద్యార్థులు నేడు మద్యం మత్తులో కన్న తల్లిదండ్రులను సైతం హింసించడానికి ఏమాత్రం ఆలోచించడం లేదు ఇటువంటి ప్రమాదకరమైన మాదకద్రవ్యాలను మనదేశంలోకే అనుమతించకుండా ప్రభుత్వాధికారులందరూ ఎక్కడికక్కడ నిగా వేస్తూ విధులను నిర్వహిస్తున్నా మెరుపు వేగంతో దేశమంతటా వ్యాపిస్తున్నాయి. మాదకద్రవ్యాలను విద్యార్థులు సైతం తిప్పి కొట్టాలని ఆశిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్షురాలు చారులత, ఏఐఎస్ఎఫ్ నియోజకవర్ అభి, హాస్టల్ వార్డెన్ సుమన్, డానియల్ తదితరులు పాల్గొన్నారు.



# శ్రీకాళహస్తిలో భూ సమస్యలపై సమావేశం











**స్వర్ణ సాగరం శ్రీకాళహస్తి రూరల్**

శ్రీకాళహస్తి పంచాయతీ రాజ్ గెస్ట్ హౌస్ నందు నేడు సమావేశం జరిగింది. జిల్లా కలెక్టర్, జిల్లా ఫారెస్ట్ అధికారులు మరియు ఆర్డిఓ ఆధ్వర్యంలో నిర్వహించబడిన ఈ సమావేశంలో శ్రీకాళహస్తి రూరల్ మండలంలోని సింహచల కండ్రిగ మరియు గొల్లపల్లి పంచాయతీ, బి.వి.పురం హరిజనవాడ గ్రామాల ప్రజల భూ సమస్యలపై చర్చించారు. శ్రీకాళహస్తి శాసనసభ్యులు బొజ్జల సుధీర్ రెడ్డి ఈ సందర్భంగా మాట్లాడుతూ, గత కొద్ది రోజులుగా సింహాచల కండ్రిగ దళితులకు మరియు ఫారెస్ట్ అధికారులకు మధ్య జరుగుతున్న భూ వివాదంపై వస్తున్న కథనాల నేపథ్యంలో జిల్లా కలెక్టర్ తో చర్చించి, సంబంధిత భూముల యదార్థ పరిస్థితిని, అక్కడ జరుగుతున్న వాస్తవ పరిస్థితులను మీడియాకు తెలియజేస్తూ, సంబంధిత దళిత రైతులకు న్యాయం చేకూర్చాలనే సంకల్పంతో ఈరోజు రైతులతో సమావేశం ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు.

# నాలుగు సంవత్సరాలుగా తన సొంత గూటికీ చేరుకోలేని మహిళా

**కుప్పంస్వర్ణసాగరం న్యూస్**

ప్రాణహాని బెదిరింపులు దాడి ఘటనపై ఫిర్యాదు. 27-05-2025 తేదీన సాయంత్రం సుమారు 7:15 గంటలకు వాణియంబాడి నుండి నేను ఇంటికి వెళ్తూ ఉండగా, మైకన్నన్, అతని భార్య అముధా , సులోచన నన్ను వెంబడించి ఆపి దాడి చేశారు. అముధా నాతో అసభ్యంగా ప్రవర్తించి, దుర్భాషలాడింది. సులోచన నన్ను పట్టుకుని కింద పడేసి కర్రతో కొట్టి తీవ్ర గాయాలు చేసింది. మైకన్నన్ నన్ను తల జుట్టు పట్టుకొని లాగి, కడుపులో తన్నుతూ చంపేస్తానని బెదిరించాడు. ఆ ఘటన తరువాత నేను వాణియంబాడి ప్రభుత్వ ఆసుపత్రిలో రెండు రోజులపాటు ఇన్‌పేషెంట్‌గా చికిత్స పొందాను. తిమ్మంపేట్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినప్పటికీ ఇప్పటివరకు మైకన్నన్, అముధా, తిరుమల్ మరియు సులోచనపై ఎలాంటి యఫ్ఐఆర్ నమోదు కాలేదు. పైగా వారు నన్ను ఫిర్యాదు వెనక్కి తీసుకోవాలని, లేకపోతే నిన్ను నీ కుటుంబంతో సహా అంతం చేస్తామని మళ్లీ బెదిరించారు. 02-06-202 ఉదయం 8:00 గంటలకు నేను ద్విచక్ర వాహనంపై వెళ్తున్నప్పుడు, మైకన్నన్ దాదాపు 3



కిలోమీటర్ల పాటు నన్ను వెంబడించి, రోడ్డుపై అడ్డగించి మళ్లీ ప్రాణహాని హెచ్చరికలు చేశాడు. "నిన్ను చంపకుండా వదలను" అని బహిరంగంగా బెదిరించాడు. అందువల్ల, నాకు లేదా నా కుటుంబ సభ్యులకు ఎటువంటి ప్రమాదం జరిగితే, దానికి పై పేర్కొన్న మైకన్నన్, అముధా, సులోచన కారణమని రికార్డు చేయబడాలని మనవి. నా సోదరుడు శక్తివేలను అరణ్యంలో తెలియని మృతదేహంగా పడేశారని కూడా తెలుపుతున్నాను. నన్ను కూడా అదే విధంగా హత్య చేసేందుకు ప్రయత్నిస్తారేమో అనే భయంతో. కాబట్టి, దయచేసి వీరిపై తగిన చర్యలు తీసుకొని, నా ప్రాణ రక్షణ కోసం తగు భద్రత కల్పించవలసిందిగా మనవి పోలీస్ స్టేషన్ ఫిర్యాదు మంజుల చిత్తూరు జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ సూచనల మేరకు తాసిల్దార్ సమక్షంలో తగు రక్షణ కల్పించి తమ ఇంటికి సురక్షితంగా చేర్చాలని హామీ ఇచ్చారు కలెక్టర్ ఆదేశాని ఉల్లంఘించి ఆమెపై ఎలాంటి ఆమెపై ఎలాంటి అగైత్యాలకు పాల్పడిన వారిపై చట్టరీత్యా కేసు నమోదు చేసి తగు చర్యలు తీసుకోబడును చిత్తూరు జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశించారు

## రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ప్రారంభం








**స్వర్ణ సాగరం శ్రీకాళహస్తి రూరల్**

రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ఏర్పాటుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. మంగళగిరి వద్ద ఈ ఇన్నోవేషన్ హబ్‌ను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు , ఐటీ మంత్రి నారా లోకేష్ ప్రారంభించారు. తిరుపతి (శ్రీకాళహస్తి నియోజకవర్గం) లో జిల్లా కలెక్టర్, ఐఐటీ డైరెక్టర్ లతో కలిసి శ్రీకాళహస్తి శాసన సభ్యులు బొజ్జల సుధీర్ రెడ్డి ఈ హబ్‌ను ప్రార ంభించారు. ఈ కార్యక్ర మం మంగళగిరిలోని మయూరి టెక్ పార్క్ ప్రాంగణంలో జరిగింది. దాదాపు 50 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఈ ఇన్నోవేషన్ హబ్ ఏర్పాటయింది. ప్రపంచ అవసరాలను తీర్చగల స్టార్టప్ కేంద్రంగా ఇది విలసిల్లేలా కార్యాచరణకు సిద్ధమైంది. "కుటుంబానికో పారిశ్రామికవేత్త" అనే నినాదాన్ని సాకారం చేసేందుకు రాష్ట్రవ్యాప్తంగా గ్రిడ్ ఏర్పాటు చేయబడింది. అమరావతి కేంద్రంగా రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ఏర్పాటయింది. తిరుపతి, విశాఖపట్నం, విజయవాడ, అనంతపురం, రాజమహేంద్రవరంలో స్పోక్‌లు ఏర్పాటు చేయబడ్డాయి. ఈ సందర్భంగా శ్రీకాళహస్తి శాసనసభ్యులు బొజ్జల సుధీర్ రెడ్డి మాట్లాడుతూ, ఆంధ్రప్రదేశ్‌లో అభివృద్ధి శరవేగంగా జరుగుతోందని, రాష్ట్రమంతటా జరుగుతున్న అభివృద్ధి ఒక ఎత్తు అయితే, శ్రీకాళహస్తి నియోజకవర్గంలో ప్రత్యేకంగా అభివృద్ధి పరుగులు పెడుతోందని అన్నారు. దీనికి కారణం, గతంలో బొజ్జల గోపాలకృష్ణారెడ్డి ఉన్నప్పుడు ఎన్నో ఐఐటీ, ఇఇజర్ వంటి విద్యాసంస్థలను తీసుకువచ్చి నియోజకవర్గాన్ని విద్యా కేంద్రంగా నిలిపారని, ఎన్నో ఎలక్ట్రానిక్ కంపెనీలను తీసుకువచ్చి ఎలక్ట్రానిక్ హబ్‌గా ఏర్పాటు చేశారని గుర్తు చేశారు. నేడు నారా లోకేష్ ఆధ్వర్యంలో టాటా ఇన్నోవేషన్ హబ్ ఏర్పాటు చేయడం చాలా సంతోషంగా ఉందని, నూతన పారిశ్రామికవేత్తలను తయారు చేసే దిశగా ఈ హబ్ ఎంతగానో ఉపయోగపడుతుందని ఆయన తెలిపారు.

## హంద్రీనీవా పనులను పరిశీలించిన కలెక్టర్



**కుప్పం స్వర్ణసాగరం న్యూస్**

కుప్పం నియోజకవర్గంలోని పరమ సముద్రం చెరువు వద్ద హంద్రీ-నీవా పనులను జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ పరిశీలించారు. కుప్పం పరిధిలోని 430 చెరువులను హంద్రీ-నీవా జలాలతో నింపనున్నట్లు తెలిపారు. చెరువుల సామర్థ్యం పెంపు, చెక్‌డ్యామ్‌లు మరమ్మతులపై ముందస్తు చర్యలు తీసుకోవాలని ఇంజనీర్లకు ఆదేశించారు. త్వరలో ముఖ్యమంత్రి పర్యటనలో పరమ సముద్రం చెరువు వద్ద బహిరంగ సభ, జలహారతి, పైలాన్ ఆవిష్కరణ కార్యక్రమాలు జరగనున్నాయి. కార్యక్రమంలో ఇంజనీరింగ్ అధికారులు, ప్రాజెక్టు ప్రతినిధులు పాల్గొన్నారు.

## కోబాకు సుబ్రహ్మణ్యం - శాంతి దంపతుల గృహప్రవేశం ఘనంగా



**స్వర్ణ సాగరం- తొట్టంబేడు**

శ్రీకాళహస్తి పట్టణంలోని 1వ వార్డు వి.యం.పల్లికి చెందిన కోబాకు సుబ్రహ్మణ్యం %-% శాంతి దంపతుల నూతన గృహప్రవేశ మహోత్సవం శనివారం అంగరంగ వైభవంగా జరిగింది. ఉదయం ప్రత్యేక ముహూర్తంలో వేద మంత్రోచ్ఛారణల మధ్య పూజలు జరిపి గృహప్రవేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా శ్రీకాళహస్తీశ్వర స్వామి వారి దేవస్థానం మాజీ ధర్మకర్తల మండలి అధ్యక్షులు అంజూరు తారక శ్రీనివాసులు, తిరుపతి జిల్లా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి ఉన్నం వాసుదేవ నాయుడు, మండల ఎంపీపీ నిర్మలమ్మ విచ్చేశారు. అనంతరం వారు దంపతులను ఆశీర్వదించి జ్ఞాపికను అందజేశారు. గృహప్రవేశ వేడుకలో స్థానిక ప్రజలు, బంధుమిత్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. విశిష్ట అతిథుల రాకతో వాతావరణం సందడి వాతావరణంగా మారింది. గృహనిర్మాణం పూర్తి చేసి కొత్త ఇంట్లో అడుగుపెడుతున్న దంపతులను అందరూ హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పసల రమణయ్య, పసల కుమారస్వామి, శ్రీవారి సురేష్, బుల్లెట్ జయశ్యామ్, పసల కృష్ణయ్య, పసల సురేష్, రామచంద్రయ్య, కమలాకర్, మధు తదితరులు పాల్గొన్నారు. కొత్త ఇంటిని చూసేందుకు గ్రామస్థులు తరలివచ్చి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో సాంప్రదాయ రీతిలో పూజలు, విందు ఏర్పాట్లు జరిగాయి.

# తలుపులు విరగ్గొట్టి..బీగాలు పగలగొట్టి

**టీ దుకాణంలో చోరీకి యత్నం**

**వన్ టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేసిన బాధితులు**





**స్వర్ణ సాగరం- శ్రీకాళహస్తి**

శ్రీకాళహస్తి పట్టణం వన్ టౌన్ పరిధిలోని శ్రీకాళహస్తి సబ రిజిస్ట్రార్ కార్యాలయం ఎదురుగా ఉన్న టీ దుకాణం లో మంగళవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు టీ దుకాణం తలుపు విరగ్గొట్టి, బీగాలు పగలగొట్టి చోరీకి విఫలయత్నం చేశారు. పసుపులేటి మ-ునస్వామి కుటుంబం రిజిస్ట్రార్ ఆఫీస్ టి దుకాణం పెట్టుకుని జీవనం సాగిస్తున్నారు. ఇదే షాపులో అతని కోడలు జెరాక్స్ సెంటర్, కుమారుడు పాల వ్యాపారం చేస్తూ జీవనం సాగిస్తున్నారు. మంగళవారం సాయ ంత్రం వరకు షాపు నడుపుకుని ఇంటికి వెళ్లారు. ఉదయం 9.30గంటలకు షాపుకు వచ్చి చూడగా తలుపు విరగ్గొట్టి, బీగాలు పగలగొట్టి ఉండటాన్ని గమనించి వన్ టౌన్ పోలీబులకు ఫిర్యాదు చేశారు. బీగాలు పూర్తిగా పగిలినట్లయితే నాలుగు కంప్యూటర్ లు ,ఇతరత్రా సామగ్రి చోరీకి గురయ్యేవి. తగు చర్యలు తీసుకోవాలని మునస్వామి కుటుంబ సభ్యులు కోరుతున్నారు.

# రైతులు ఈ క్రాప్ లో పేర్లు నమోదు చేసుకోవాలి-ఏ డి ఏ నాగార్జునసాగర్




**స్వర్ణ సాగరం(నాయుడుపేట) ఆగస్టు 20.**

నాయుడుపేట మండలంలో వివిధ రకాల సాగు చేస్తున్న రైతులు ఈ క్రాప్ లో పేర్లు నమోదు చేసుకోవాలని మండల ఏ డి ఏ నాగార్జునసాగర్ అన్నారు. బుధవారం నాయుడుపేట మండలంలోని పూదూరు,పూడేరు గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ క్రాప్ లో పేర్లు నమోదు చేసుకోవడం వలన ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు ప్రభుత్వం అందించే సబ్సిడీలను పొందవచ్చని తెలియజేశారు. ప్రతి రైతు ఈ కాప్ లో పేర్లు నమోదు చేసుకోవాలని తెలియజేశారు. అనంతరం సబ్సిడీపై రైతులకు జీలుగలు పంపిణీ చేశారు,ఈ కార్యక్రమం లో మండల వ్యవసాయాధికారి జోగి గణేష్,వి ఏ ఏ లు, రైతులు పాల్గొన్నారు.ద

# వికలాంగుల పెన్షన్లు తొలగించొద్దు



**స్వర్ణసాగరం-శ్రీకాళహస్తి**

వికలాంగుల పెన్షన్లు తొలగించొద్దని కెవిపిఎస్ జిల్లా నాయకులు సంక్రాంతి వెంకటయ్య ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. స్థానిక పుచ్చలపల్లి సుందరయ్య భవన్ లో బుధవారం కెవిపిఎస్, డప్పు కళాకారుల సంఘం జిల్లా స్థాయి సమావేశం జరిగింది. ఓవైపు పెన్షన్ నగదు పెంచామంటూనే మరోవైపు తొలగింపు కార్యక్రమానికి శ్రీకారం చుట్టడం అన్యాయమని వెంకటయ్య అన్నారు. వికలాంగులకు సామాజిక భరోసా పెన్షన్ పేరుతో నెలకు రూ.6 వేలు ఇవ్వడం ఇష్టం లేక చంద్రబాబు ప్రభుత్వం వికలత్వ పర్సెంటేజీలు పేరు చెప్పి అన్యాయంగా తొలగింపు కార్యక్రమానికి దిగిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. సెప్టెంబర్ నెలకు జిల్లా వ్యాప్తంగా 30 వేల మంది వికలాంగులు తమ పెన్షన్ హక్కును కోల్పోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇదేంటని అడిగిన వికలాంగులకు మళ్లీ సదరం క్యాంపుకు వెళ్లి ధ్రువీకరణ పత్రాలు తెచ్చుకోండంటూ ఉచిత సలహాలివ్వడం అన్యాయమని వాపోయారు. వికలాంగులు మళ్లీ సదరం క్యాంపు నుంచి ధ్రువీకరణ పత్రాలు పొందాలంటే కనీసం ఆరు నెలల సమయమైనా పడుతుందని వివరించారు. ప్రభుత్వం వెంటనే స్పందించి రద్దయిన పెన్షన్లను పునరుద్ధరించాలని కోరారు. లేకుంటే ఆందోళనలు తప్పవని హెచ్చరించారు. డప్పు కళాకారుల సంఘం జిల్లా అధ్యక్షులు పెంచలయ్య, ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి వేణు తదితరులు పాల్గొన్నారు.

## వినాయక మండపాల ఏర్పాటు సమాచారం నమోదు చేసుకోవాలి



**– సిఐ బి రాజేష్ నాయక్.**

స్వర్ణ సాగరం డోర్నకల్, ఆగస్టు 20

వినాయక చవితి ఉత్సవాల సందర్భంగా, డోర్నకల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని వినాయక మండపాల నిర్వాహకులు, పోలీస్ పోర్టల్ లో ఆన్లైన్ ద్వారా విగ్రహాల ఏర్పాటు కు సంబంధించిన పూర్తి సమాచారం తెలియజేయాలని డోర్నకల్ సీఐ రాజేష్ నాయక్ తెలిపారు. https:// policepo rtal.tspolice .gov.in/index.htm ఆన్లైన్ లింక్ ను క్లిక్ చేసి అందులో దరఖాస్తు దారుని వివరాలు,విగ్రహం ఏర్పాటు చేస్తున్న ప్రదేశం,ఏ ఏరియా పోలీస్ స్టేషన్ పరిధిలోకి వస్తుంది.విగ్రహం ఎత్తు, విగ్రహం ఏర్పాటు చేస్తున్న మండపం ఎత్తు,కమిటీ సభ్యుల పేర్లు వారి ఫోన్ నెంబర్లు,విగ్రహం ప్రతిష్టించే రోజు,నిమజ్జనం చేసే తేదీ సమయం,ప్రదేశం,ఆ ప్రదేశానికి ఏ వాహనంలో చేరుకుంటారు.అన్ని వివరాలు మండప నిర్వహకులు, వినాయక ఉత్సవ కమిటీ సభ్యులు,వాలంటీర్ల వివరాలు,ఫోన్ నెంబర్లు చిరునామా పూర్తిగా నమోదు చేయాలని సూచించారు. ఆన్లైన్ ద్వారా వివరాల నమోదుకి సంబంధించి ఏవైనా సందేహాలుంటే పోలీస్ స్టేషన్ లో సంప్రదించాలని సూచించారు.పర్యావరణ పరిరక్షణకు ఉత్సవ కమిటీ సభ్యులు మట్టి విగ్రహాల ప్రతిష్టాపనకు ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు. ఎలాంటి అత్యవసర సమయంలోనైనా పోలీస్ యంత్రాంగం 24 గంటలు అందుబాటులో అప్రమత్తంగా ఉంటుందని,శాంతి భద్రతలకు సంబంధించి ఎటువంటి సమాచారం ఉన్న వెంటనే డయల్ 100 డయల్ 112 ను సంప్రదించాలని తెలియజేశారు.మండపాలలో వినాయక విగ్రహాలు ఏర్పాటు చేసుకొని ఉత్సవాలు నిర్వహించే వారు సామరస్యపూర్వక వాతావరణం లో , శాంతియుతంగా ఉత్సవాల నిర్వహణకు పోలీస్ శాఖ కి సహకరించాలని కోరారు. ఇంతకు మునుపు వినాయక మండపం ఏర్పాటు చేసినటువంటి,ఎలాంటి వివాదాస్పదం కాని ప్రదేశంలో మాత్రమే మండపాన్ని ఏర్పాటు చేసుకోవాలని, విద్యుతు ప్రమాదాలకు గురికాకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని,స్త్రీలకు చిన్నపిల్లలకు ప్రత్యేకమైన క్యూలైన్లు నిర్వహించి వారిని గౌరవించాలని,వినాయక మండపాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని మండపాల నిర్వాహకులకు సిఐ భూక్య రాజేష్ నాయక్ సూచించారు.

## ఇన్స్పైర్ అవార్డ్స్ 2025 నామినేషన్లపై శిక్షణా కార్యక్రమం



స్వర్ణ సాగరం శ్రీకాళహస్తి రూరల్

పుత్తూరు విభాగంలోని అన్ని యాజమాన్యాల సైన్స్ ఉపాధ్యాయులకు ఇన్స్పైర్ అవార్డ్స్ 2025 నామినేషన్లపై ఒకరోజు శిక్షణా కార్యక్రమం ఈరోజు శ్రీకాళహస్తిలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహించబడింది. జిల్లా సైన్స్ అధికారి శ్రీ భానుప్రసాద్ గారు, ఎంఈఓలు శ్రీమతి భువనేశ్వరి, శ్రీమతి భారతి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీ వెంకటయ్య గారు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులను ఉద్దేశించి ప్రసంగిస్తూ, ప్రతి పాఠశాలలో ఇన్నోవేషన్ ఐడియా బాక్స్ ఏర్పాటు చేయాలని, ప్రతి పాఠశాల నుండి విద్యార్థుల వినూత్న ఆలోచనలతో కూడిన 5 నామినేషన్లు ఎగ్జిబిట్లతో సమర్పించాలని సూచించారు. ఈ శిక్షణా కార్యక్రమంలో భాగంగా అగస్త్య ఇంటర్నేషనల్ ఫౌండేషన్ కోఆర్డినేటర్లు శ్రీ వీరేశ్, శ్రీ ప్రేమ కుమార్ లు అగస్త్య వర్చువల్ స్కూల్ పై శిక్షణనిచ్చారు. రిసోర్స్ పర్సన్స్ గా శ్రీ కామాక్షయ్య, డాక్టర్ సుబ్రమణ్య శర్మ, శ్రీ లింకన్, శ్రీ రుద్రయ్య, శ్రీ మూర్తి, శ్రీ స్టాలిన్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమం ద్వారా ఇన్స్పైర్ అవార్డుల నామినేషన్ల ప్రక్రియను వేగవంతం చేయాలని ఆశిస్తున్నారు. విద్యార్థుల సృజనాత్మకతను ప్రోత్సహించడం ద్వారా విజ్ఞాన శాస్త్రంలో నూతన ఆవిష్కరణలకు దోహదపడే విధంగా ఈ కార్యక్రమం ఉపయోగపడుతుందని ఆశిస్తున్నారు. ప్రతిభావంతులైన విద్యార్థులను గుర్తించి, వారికి తగిన ప్రోత్సాహం అందించడం ద్వారా భవిష్యత్తులో శాస్త్ర సాంకేతిక రంగంలో దేశానికి పేరు ప్రఖ్యాతులు తెచ్చే విధంగా ఈ కార్యక్రమం రూపొందించబడింది. విద్యార్థులు తమ ప్రతిభను ప్రదర్శించడానికి ఇది ఒక మంచి వేదిక. ఉపాధ్యాయులు విద్యార్థులకు సరైన మార్గదర్శకత్వం అందించి, వారి సృజనాత్మకతను వెలికితీయాలని కోరారు.

## రేణిగుంటలో ప్రెస్ క్లబ్ తొలి సమావేశం



రేణిగుంట స్వర్ణ సాగరం ఆగస్టు 20

నూతనంగా ఏర్పాటైన రేణిగుంట ప్రెస్ క్లబ్ అసోసియేషన్ రిజిస్ట్రేషన్ పూర్తయిన అనంతరం తొలి సమావేశం మంజుల టవర్స్‌లో బుధవారం నిర్వహించారు. ఈ సమావేశానికి అధ్యక్షులు మురళి, ప్రధాన కార్యదర్శి మణి, సీనియర్ జర్నలిస్ట్ శివమూర్తి, కమిటీ సభ్యులు హాజ రయ్యారు.ఈ సందర్భంగా ప్రెస్ క్లబ్ అభివృద్ధి, జం ర్నలిస్టుల సంక్షేమం,వారికి ఎదురవుతున్న సమస్యలు, పరిష్కార మార్గాలపై చర్చలు జరిపారు.సభ్యుల మధ్య ఉత్సాహపూరిత చర్చలు సాగగా, భవిష్యత్ కార్యాచరణపై ఏకాభిప్రాయం కుదిరింది. రాబోయే రోజుల్లో ప్రెస్ క్లబ్ కార్యకలాపాలను మరింత బలోపేతం చేయాలని తీర్మానించారు.

# విన్ టెక్ పరిశ్రమ ఉద్యోగుల ఆందోళన

# ఉద్యోగాల భద్రత కోసం పోరాటం

స్వర్ణ సాగరం శ్రీకాళహస్తి రూరల్



శ్రీకాళహస్తి వద్ద విన్ టెక్ పరిశ్రమ ఉద్యోగుల ఆందోళన కార్యక్రమం జరిగింది. కార్పొరేట్ పరిశ్రమల యాజమాన్యాల మోసాలను గుర్తించిన ఉద్యోగులు, కార్మికులు ఆందోళనలకు దిగుతున్నారు. ఇటీవల కార్బన్ – నియో లింక్ పరిశ్రమ యాజమాన్యంపై కార్మికులు ఆందోళన చేపట్టగా, తాజాగా విన్ టెక్ ఎలక్ట్రానిక్ పరిశ్రమ ఉద్యోగులు కూడా ఆందోళన బాట పట్టారు. బుధవారం సాయంత్రం పరిశ్రమ ఎదుట 'మా కడుపులు కొట్టొద్దు.. రోడ్డున పడేయొద్దు' అంటూ నినాదాలు చేశారు. బాధిత ఉద్యోగుల కథనం ప్రకారం.. తిరుపతి–రేణిగుంట ఇండస్ట్రియల్ కారిడార్ లోని విన్ టెక్ ఎలక్ట్రానిక్ మ్యానుఫ్యాక్చరింగ్ పరిశ్రమ–1, 3లలో 200 మంది ఉద్యోగులు, 2 వేల మంది కార్మికులు పనిచేస్తున్నారు. లాభాల్లో నడుస్తున్న ఈ పరిశ్రమ ఈ ఏడాది ఏప్రిల్ లో లక్సేర్ కంపెనీతో ఒప్పందం కుదుర్చుకుంది. కార్మికులు, ఉద్యోగులతో పాటు ఆస్తులు, ముడి సరుకును కూడా ఈ ఒప్పందంలో భాగం చేసింది. జూన్ 10వ తేదీన అగ్రిమెంట్ కుదుర్చుకోగా, జూలై 2వ తేదీన లక్సేర్ కంపెనీ యాజమాన్యం 'మీరంతా ఇకపై మావారు' అని ప్రకటించింది. జూలై 31వ తేదీన లాకౌట్ ప్రకటించి కార్మికులు, ఉద్యోగులకు షాక్ ఇచ్చింది. 2 వేల మంది కార్మికులను తొలగించగా, 200 మంది ఉద్యోగులను యధాతథంగా ఉంచింది. ఉత్పత్తి జరగకపోయినా వింటెక్ పరిశ్రమే ఉద్యోగులకు వేతనాలు చెల్లించింది. ఆగస్టు నెల వరకు కూడా వేతనాలు చెల్లిస్తామని హామీ ఇచ్చిన యాజమాన్యం, సెప్టెంబరు నుంచి తమ బాధ్యత కాదని స్పష్టం చేసింది. ఇటీవల విన్ టెక్ పరిశ్రమపై జరిగిన జీఎస్టీ దాడుల్లో కేంద్రానికి రూ. 250 కోట్లు ఎగ్గొట్టినట్లు తేలడంతో పరిశ్రమ విశ్వసనీయత దెబ్బతిని కొనుగోళ్లు జరగలేదని లక్సేర్ తెలిపింది. ఒప్పందాన్ని రద్దు చేసుకుంటున్నామని, ఉద్యోగులు మరో దారి చూసుకోవాలని సూచించింది. ప్లాంట్–1లోని ముడి సరుకును కూడా బయటకు తరలించింది. దీంతో ఉద్యోగులు తిరగబడి, ఉద్యోగాల భద్రత కోసం ఆందోళన చేపట్టారు.

విన్ టెక్(లక్సేర్) పరిశ్రమ వద్ద ఆందోళన చేస్తున్న ఉద్యోగులను సీఐటీయూ నాయకులు పరామర్శించి మద్దతు తెలిపారు. ఒప్పందం ప్రకారం లక్సేర్ కంపెనీ ఉత్పత్తులను ప్రారంభించాలని, ఉద్యోగులను యధావిధిగా కొనసాగించాలని డిమాండ్ చేశారు. లాకౌట్ కారణంగా ఉపాధి కోల్పోయిన కార్మికులను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని, లేనిపక్షంలో ఆందోళన తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు జి. బాలసుబ్రమణ్యం, జయచంద్ర, మునిరాజా, కరిముల్లా, సెల్వం తదితరులు పాల్గొన్నారు.

# మండలంలో దోమ పిడిఆకస్మిక తనిఖీ

స్వర్ణ సాగరం బైరెడ్డిపల్లి ఆగస్టు 20:-



చిత్తూరు జిల్లా బైరెడ్డిపల్లి మండల ఉపాధి హామీ సిబ్బందిపై దోమ పీడీ ఏ. రవికుమార్ ఆకస్మికంగా దూసుకువచ్చారు. మండలంలో వచ్చిన ఫిర్యాదులు, ప్రజల నుంచి వెల్లువెత్తిన ఆరోపణల నేపథ్యంలో సిబ్బందిని నేరుగా ప్రశ్నించిన పనితీరుపై సీరియస్ అయ్యారు తర్వాత ఉపాధి హామీ సిబ్బంది అయినా ఏపీఓ, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్ల పనితీరుపై రికార్డులు తనిఖీ చేసి లోపాలపై ఫైర్ అయ్యారు."మండల ప్రజలకు న్యాయం జరగాలి. కూలీల సంఖ్య తప్పనిసరిగా పెంచాలి. అర్హులకే పని ఇవ్వాలి. ప్రతి పనిస్థలంలో మాస్టర్ ఉండాలి. ఆదేశించారుప్రజల జీవనోపాధి కోసం ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలు సక్రమంగా అమలయ్యేలా క్షేత్రస్థాయిలో నిరంతరం పర్యవేక్షించాలని సిబ్బందిని ఉద్దేశించి హెచ్చరించారు.ప్రెస్మీట్లో ఆయన మాట్లాడుతూ . పాడి ఆవులు పెంచే చిన్న సన్న రైతులకు ఆవులు షెడ్ నిర్మాణం, మామిడి తోటలు, కూరగాయల పంటల కోసం చెక్ బందీలు, (కాంపౌండ్లు) ప్రభుత్వ రాయితీతో మంజూరు చేస్తామని తెలిపారు. పట్టాదారు పాసుబుక్, పంట నమూనా, జాబ్ కార్డ్ కలిగిన వారికి ఈ సదుపాయాలు అందుతాయని స్పష్టంచేశారు.

## రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ప్రారంభం



స్వర్ణ సాగరం-శ్రీకాళహస్తి

తిరుపతి కేంద్రంగా రతన్ టాటా ఇన్నోవేషన్ స్పోక్ హబ్ ను బుధవారం రేణిగుంట విమానాశ్రయం సమీపంలోని ఇంటర్నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ డిజిటల్ టెక్నాలజీస్ (%××ఱ%) వద్ద జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్, శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి ప్రారంభించారు. రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ అనే కొత్త కార్యక్రమాన్ని ప్రారంభించడం కోటప్ప ప్రభుత్వం ప్రారంభించడం హర్షనీయమన్నారు. ఇది యువ పారిశ్రామికవేత్తలకు, స్టార్టప్ వ్యాపారం మొదలు పెట్టాలనుకునేవారికి అద్భుతమైన అవకాశమన్నారు. ఎవరైనా మంచి ఆలోచనలు కలిగి, ఉత్సాహం ఉన్న వారు ఒక మార్గదర్శకత కోసం, మంచి కారణం కోసం వేచి చూస్తున్న వారి కోసం ఈ రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ గొప్ప అవకాశంగా మారుతుందన్నారు. గడిచిన 24 గంటల్లో 1,60,000 మంది యువకులు తమ కంపెనీలు స్టార్ట్ చేసేందుకు రిజిస్టర్ చేసుకోవడం ఓ రికార్డు అన్నారు. తిరుపతికి అదాని లీడ్ పార్ట్నర్ అని కలెక్టర్ తెలిపారు. వారితో పాటు మరో రెండు కంపెనీలైన నవయుగ, అమర్ రాజా లు కూడా లీడ్ పార్ట్నర్ లుగా ఉంటాయని చెప్పారు. ఇవి కాకుండా నాలెడ్జ్ పార్ట్నర్ గా ఐ.ఐ.టి ఉందన్నారు. ఇది ప్రభుత్వ, కార్పొరేట్, అండ్ అకడమిక్ రంగాల సమ్మేళనమన్నారు. తిరుపతి ఎస్వీ యూనివర్సిటీ వైస్ ఛాన్సిలర్ ఆచార్య అప్పారావు, జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్, ట్రైనీ కలెక్టర్ సందీప్ రఘువంశి, శ్రీకాళహస్తి ఆర్డీవో భానుప్రకాష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## బంగారుపాళ్యం పట్టణం లో శ్రీ కృష్ణ భగవానుడు ప్రతిమ ఊరేగింపు కార్యక్రమం






బంగారుపాళ్యం.స్వర్ణసాగరం.ఆగస్టు 20

త్రైత సిద్ధాంత ప్రబోధ సేవాసమితి ఇందూ జ్ఞాన వేదిక బంగారుపాళ్యం కమిటీ ఆధ్వర్యంన శ్రీ కృష్ణుడి ప్రతిమ ను శ్రీ కృష్ణ జన్మాష్టమి రోజు ఆగస్టు 16 న శనివారం నాడు చిత్తూరు జిల్లా, బంగారుపాళ్యం టౌన్ లోని రాజావీధి సెంటర్ లో వేదిక నిర్మించి కొలువు తీర్చి,స్వామికి ప్రతి రోజు ఉదయం సాయంత్రం జ్ఞాన రీత్యా నిత్య పూజలు భగవద్గీత శ్లోక పారాయణం చేసి 5వ రోజు ఆగస్టు 20 న బుధవారం శ్రీకృష్ణ ప్రతిమ ఊరేగింపు కార్యక్రమం రాజావీధి నుండి ఒటికే వీధి మీదుగా పాత పోస్ట్ ఆఫీస్ వీధి గుండా ఎంబిటి రోడ్ మీదుగా తగ్గువారిపల్లి నుండి మేదర్ వీధి నెహ్రూ వీధి గుండా తిరిగి ఒటికే వీధి లోకి వచ్చి రాజా వీధి శ్రీ కృష్ణ ప్రాంగణం వేదిక వద్ద కు మధ్యాహ్నం 2 గంటల నుండి సాయంత్రం 5 వరకు ఊరు ఎరిగింపు అంగరంగ వైభవంగా జరిగింది (నేటి ఊరు ఎరిగింపు కార్యక్రమం తో వేడుకలు ముగిశాయి ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా బంగారుపాళ్యం మాజీ సర్పంచ్ పద్మావతి,ఎంబి కృష్ణమూర్తి,ఎంఈఓ రమేష్ బాబు,ఆర్ఎస్ఎస్ ప్రతినిధి ప్రతాప్ లు విచ్చేసి స్వామికి కార్యకర్ణం సమర్పించి పల్లకి సేవలో పాల్గొన్నారుఈ కార్యక్రమంలో త్రైత సిద్ధాంతం ప్రబోధ సమితి–ఇందూ జ్ఞాన వేదిక బంగారు పాళ్యం కమిటీ అధ్యక్షులు, సభ్యులు డి.బాలాజీగారు,వాణీశ్రీ, సాయిచరణ్,సిద్దార్థ, హేమంత్,ఉదయ్,లత, చాముండేశ్వరి,చిట్టెమ్మ, చటర్జీ,హర్ష వర్ధన్, హేమంత్,రేణుకాదేవి, హరిబాబు,రామతులసి, భానుమతి,రెడ్డెమ్మ, శాంతమ్మ,భాస్కర్,అశోక్ బాబు,ఝాన్సీ,కిరణ్, మునిరత్నం,ఉదయ్, జ్యోతి,రేఖకళ్యాణి, గౌతమీ,మరియు జిల్లాలోని ప్రబోధ సేవా సమితి సభ్యులు కుప్పం, వి.కోట,పలమనేరు, పీలేరు ప్రాంతాల నుండి పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలోగ్రామస్థులు అధిక సంఖ్య లో విచ్చేసి దైవ దర్శనం చేసుకునీ ఊరు ఎరిగింపు లో పాల్గొన్నారు



# సస్పెన్స్‌కు పుల్‌స్టాప్.. నాగార్జున 100వ సినిమా లాంచ్‌పై క్లారిటీ

ఈ ఏడాది కుబేర, కూలీ సినిమాలతో సూపర్ సక్సెస్ అందుకున్నాడు టాలీవుడ్ స్టార్ యాక్టర్ అక్కినేని నాగార్జున. ఇటీవలే కూలీ సినిమాలో నెగెటివ్ షేడ్స్ ఉన్న పాత్రలో నటించగా నాగార్జున నటనకు అదిరిపోయే రెస్పాన్స్ వస్తోంది. కాగా నాగార్జున కెరీర్‌లో ల్యాండ్ మార్క్ సినిమాగా రాబోతున్న 100వ ప్రాజెక్ట్ ఎప్పుడు ఉండబోతుంది..? అంటూ ఇప్పటికే అభిమానులు, ఫాలోవర్లతోపాటు మూవీ లవర్స్ ఆసక్తిగా చర్చించుకుంటున్నారు. ఇక ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న ఈ క్రేజీ సినిమాపై క్లారిటీ వచ్చేసింది. తన ల్యాండ్ మార్క్ సినిమా వివరాలను నాగ్ స్వయంగా ప్రకటించాడు. జీ5 (ఛానల్, ఓటీటీ)లో జగపతిబాబు హోస్ట్‌గా వ్యవహరిస్తున్న జయమ్ము నిశ్చయమ్మురా షోకు నాగార్జున చీఫ్ గెస్ట్‌గా వచ్చాడు. ఆకాశం ఫేం రా కార్తీక్ దర్శకత్వంలో తన వందో సినిమా చేస్తున్నట్టు ఈ షోలో చెప్పాడు నాగ్. అంతేకాదు గత 6 నుంచి 7 నెలలుగా ఈ సినిమా ప్రీ ప్రొడక్షన్ పనులు కొనసాగుతున్నాయని కూడా చెప్పాడు. ఈ మూవీ పవర్ ప్యాక్‌డ్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా ఉండబోతుందని అభిమానులకు తెలియజేశాడు. తాజా సమాచారం ప్రకారం ఆగస్టు 29న నాగార్జున పుట్టినరోజు సందర్భంగా ఈ ప్రాజెక్ట్‌ను ఘనంగా లాంచ్ చేయనున్నారు. ఇదిలా ఉంటే సెప్టెంబర్ 5న నాగార్జున–ఆర్జీవీ కాంబోలో వచ్చి ట్రెండ్ సెట్టర్‌గా నిలిచిన శివ 4కే వెర్షన్ రిలీజ్ కానుంది. త్వరలోనే రీరిలీజ్ డేట్‌ను ప్రకటించనున్నారు. ఈ లెక్కన ఓ వైపు బిగ్ బాస్ 9 షో, మరోవైపు 100వ సినిమాతో నాగార్జున ఫుల్ బిజీగా ఉండబోతున్నాడన్నమాట.



# అందుకే బోల్డ్‌గా నటిస్తున్నా.. అలా చేస్తేనే ఇక్కడ ఉండగలం.. ఓపెన్‌గా చెప్పేసిన స్టార్ హీరోయిన్

సినిమా ఇండస్ట్రీలో స్టార్ డమ్ తెచ్చుకోవడానికి ఎంతో మంది హీరోయిన్స్ ప్రయత్నిస్తూ ఉంటారు. హీరోయిన్ గా అవకాశాలు అందుకోవడమే చాలా మందికి కష్టం.. కొంతమంది ఆఫర్స్ అందుకున్నా కూడా హీరోయిన్స్ గా రాణించలేరు. చాలా మంది హీరోయిన్స్ ఒకటి రెండు సినిమాలకే పరిమితం అవుతున్నారు. ఎంతో మంది హీరోయిన్స్ అవకాశాలు లేక సెకండ్ హీరోయిన్స్‌గా, గెస్ట్ రోల్స్ చేస్తూ.. మెప్పిస్తున్నారు. మరికొంతమంది గ్లామర్ గేట్లు ఎత్తేసి.. అందాలతో కవ్విస్తున్నారు. స్పెషల్ సాంగ్స్ లో నటిస్తూ మెప్పిస్తున్నారు. అలాంటి వారిలో ఈ అందాల భామ ఒకరు. అందంలో ఈ ముద్దుగుమ్మ తర్వాతే ఎవరైనా.. ఒకప్పుడు స్టార్ హీరోయిన్‌గా రాణించిన ఈ చిన్నది. ఇప్పుడు స్పెషల్ సాంగ్స్ తో ఊపేస్తోంది. బోల్డ్ సీన్స్ లో నటించడం వల్లే తన కెరీర్ మారిపోయిందని చెప్పుకొచ్చింది. అలాగే ఇక్కడ ఉండాలంటే అలా చేయాల్సిందే.! ఆ ముద్దుగుమ్మ ఎవరో కాదు.. మిల్కీ బ్యూటీ తమన్నా. ఈ వయ్యారి భామ ఒకప్పుడు స్టార్ హీరోయిన్‌గా రాణించింది. అందాల భామ తమ్మన్న ప్రస్తుతం బాలీవుడ్ మీద ఎక్కువగా ఫోకస్ చేస్తుంది. ఈ చిన్నది తెలుగులో ఒకప్పుడు తోప్ హీరోయిన్.. చేసిన సినిమాలనే సూపర్ హిట్స్.. దాంతో తక్కువ సమయంలో స్టార్ హీరోయిన్ గా మారిపోయింది ఈ ముద్దుగుమ్మ. మంచు మనోజ్ నటించిన శ్రీ అనే సినిమాతో హీరోయిన్ గా పరిచయం అయ్యింది తమన్నా. ఆతర్వాత హ్యాపీడేస్ సినిమా ఈ చిన్నదానికి మంచి గుర్తింపు తెచ్చిపెట్టింది.

# ఒకే వేదికపైకి రానున్న ప్రభాస్, అనుష్క




ప్రభాస్ హీరోగా, రానా, అనుష్క, తమన్నా, రమ్యకృష్ణ, సత్యరాజ్, నాజర్ ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'బాహుబలి'. రాజమౌళి దర్శకత్వంలో శోభు యార్లగడ్డ, ప్రసాద్ దేవినేని నిర్మించిన తొలి భాగం 'బాహుబలి: ది బిగినింగ్' విడుదలై ఇప్పటికే పదేళ్లు పూర్తి అయింది. ఈ సందర్భంగా 'బాహుబలి: ది ఎపిక్' పేరుతో ఈ చిత్రాన్ని అక్టోబరు 31న ప్రేక్షకుల ముందుకు తీసుకు రానున్నారు. రెండు భాగాలుగా వచ్చిన బాహుబలిని ఒకే భాగంగా ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో సందడి చేయనుంది. దీంతో చిత్ర యూనిట్ ప్రమోషన్స్ చేయాలని ప్లాన్ చేస్తుంది. 'బాహుబలి: ది ఎపిక్' విడుదల సందర్భంగా ఇప్పటికే ప్రభాస్, రానాలతో ఒక ప్రత్యేకమైన ఇంటర్వ్యూను షూట్ చేసినట్లు తెలుస్తోంది. అయితే, అనుష్క కూడా ఆ టీమ్‌లో భాగం కానున్నట్లు వార్తలు వస్తున్నాయి. ప్రస్తుతం అనుష్క కూడా హైదరాబాద్‌లోనే ఉంది. ఆమె నటించిన 'ఘాటి' చిత్రం సెప్టెంబర్ 5న విడుదల కానుంది. ఈ చిత్రం ప్రమోషన్స్‌తో పాటు 'బాహుబలి: ది ఎపిక్'ను కూడా పూర్తి చేయాలనే ప్లాన్‌లో ఆమె ఉన్నట్లు సమాచారం. తమన్నా, రమ్యకృష్ణ, సత్యరాజ్, నాజర్‌లతో పలు ఈవెంట్లు నిర్వహించాలని మేకర్స్ ప్లాన్ చేస్తున్నారట.

తెలుగు సినిమా 'గ్లోబల్ రేంజ్'కి ఎదిగింది 'బాహుబలి'తోనే. ఒక రకంగా 'పాన్ ఇండియా' ట్రెండ్ ఆరంభమైనదే 'బాహుబలి'తోనే. ఈ సినిమా తర్వాత టాలీవుడ్‌పై వరల్డ్ సినిమా దృష్టి పడింది. ఇలా 'బాహుబలి' సినిమా గురించి పలు ఆసక్తికరమైన విశేషాలు చాలానే ఉన్నాయి. అవన్నీ త్వరలో చిత్ర యూనిట్ మనకు అందించనుంది.

# వార్ 2' ఎఫెక్ట్.. నాగవంశీకి రూ. 22 కోట్లు ఆఫర్?



రెండు పెద్ద సినిమాలు ఒకేరోజు విడుదల కావడంతో బాక్సాఫీస్ దగ్గర పెద్ద యుద్ధమే జరిగింది. హిందీ బెల్ట్‌లో 'వార్ 2' హవా కనిపించగా.. దక్షిణాదిలో రజనీ 'కూలీ' జోరు కనిపించింది. హృతిక్ రోషన్, జూనియర్ ఎన్టీఆర్ నటించిన "వార్ 2" తెలుగు చిత్ర పరిశ్రమలో అనుకున్నంత రేంజ్‌లో కలెక్షన్స్ రాబట్టలేకపోయింది. కానీ, హిందీ బెల్ట్‌లో దుమ్మురేపుతుంది. ఇప్పటివరకు ప్రపంచవ్యాప్తంగా రూ. 400 కోట్లకు దగ్గరగా వార్2 కలెక్షన్స్ ఉన్నాయి. అయితే, వార్ 2 తెలుగు హక్కులను నిర్మాత నాగవంశీ సుమారు రూ. 80 కోట్ల వరకు కొనుగోలు చేసినట్లు వార్తలు వచ్చాయి. టాలీవుడ్‌లో అనుకున్నంతగా వార్2 కలెక్షన్స్ రాకపోవడంతో యశ్‌రాజ్ ఫిల్మ్స్ సంస్థ కొంత రిటర్న్ ఇచ్చేందుకు సిద్ధం అవుతుందని వార్తలు వస్తున్నాయి. టాలీవుడ్‌లో సితార ఎంటర్‌టైన్‌మెంట్స్' బ్యానర్‌పై 'వార్ 2' చిత్రాన్ని నిర్మాత నాగవంశీ విడుదల చేశారు. సుమారు రూ. 80 కోట్లకు కొనుగోలు చేసిన ఆయన సులువుగా రూ. రూ. 100 కోట్లకు పైగానే రాబడుతుందని అంచనా వేశారు. కానీ, ఈ చిత్రం విడుదలైన మొదటిరోజు నుంచే కొందరు కావాలనే ట్రోలింగ్ చేయడం ప్రారంభించారు. ముఖ్యంగా ఏపీలో తెలుగు దేశం పార్టీ క్యాడర్ జూనియర్ ఎన్టీఆర్ సినిమాకు మద్దతు ఇవ్వడం మానేసింది. వారు కూలీ సినిమా చూడాలని పెద్ద ఎత్తున సోషల్‌మీడియాలో సూచించారు. అదే సమయంలో వార్2 చిత్రంపై తీవ్రమైన ట్రోలింగ్‌కు దిగారు. దీంతో బాక్సాఫీస్ వద్ద కలెక్షన్స్‌పై ప్రభావం పడింది. బాలీవుడ్ నిర్మాణ సంస్థ యష్ రాజ్ ఫిల్మ్స్ చాలా ప్రొఫెషనల్‌గానే డీల్ సెట్ చేసుకుంటుంది. ఈ సినిమాను కొనుగొలు చేసిన నాగవంశీకి కొంత ఉపశమనం అందించడానికి ఆ సంస్థ ముందుకు వచ్చిందని సమాచారం. నాగ వంశీతో పాటు అతని భాగస్వాములకు రూ. 22 కోట్లు తిరిగి ఇవ్వడానికి యష్ రాజ్ సంస్థ అంగీకరించినట్లు బాలీవుడ్ సమాచారం. నైజాంకు రూ. 10 కోట్లు, ఏపీకి రూ.7 కోట్లు, సీడెడ్‌కు రూ. 5 కోట్ల వరకు ఇచ్చేందుకు గ్రీన్ లభించిందట. అయితే, హిందీలో ఈ చిత్రానికి ఎలాంటి నష్టం లేదని తెలుస్తోంది.



# నల్ల చీరలో కుర్రాళ్ళ గుండె గుల్ల చేస్తున్న నివేదా పేతురాజ్

మోడల్ గా కెరీర్ ప్రారంభించిన నివేదా పేతురాజ్ ఆ తర్వాత హీరోయిన్ గా మారింది. ఈ చిన్నది 2016లో ఇండస్ట్రీలోకి అడుగు పెట్టింది. ఈ క్రమంలోనే.. తమిళ, తెలుగు చిత్రాలలో మోడల్ గా కెరీర్ ప్రారంభించిన నివేదా పేతురాజ్ ఆ తర్వాత హీరోయిన్ గా మారింది. ఈ చిన్నది 2016లో ఇండస్ట్రీలోకి అడుగు పెట్టింది. ఈ క్రమంలోనే.. తమిళ, తెలుగు చిత్రాలలో నటిస్తూ మంచి గుర్తింపు తెచ్చుకుంది. ఒరు నాల్ కూతు (2016) అనే తమిళ చిత్రంతో నివేదా పేతురాజ్ ఇండస్ట్రీలోకి ఎంట్రీ ఇచ్చింది. ఆతర్వాత తెలుగులో మెంటల్ మదిలో చిత్రంతో అరంగ్రేటం చేసింది. శ్రీవిష్ణు హీరోగా నటించిన ఈ సినిమా మంచి విజయాన్ని అందుకుంది. ఆతర్వాత వరుసగా తెలుగులో నటించింది. సాయి ధరమ్ తేజ్ హీరోగా నటించిన చిత్రలహరి సినిమాలో సెకండ్ హీరోయిన్ గా చేసింది. బ్రోచేవారెవరురా, అల వైకుంఠపురములో, బ్లడీ మేరీ, విరాట పర్వం ,దాస్ కా ధమ్కీ నటించింది. విశ్వక్ సేన్ హీరోగా నటించిన దాస్ కా ధమ్కీ సినిమాలో నటనతో పాటు తన అందంతో ఆకట్టుకుంది ఈ బ్యూటీ. ఇక రీసెంట్ గా పరువు అనే సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చింది ఈ చిన్నది. ఓటీటీలో రిలీజ్ అయిన ఈ సినిమా పర్లేదు అనిపించుకుంది. తాజాగా ఓ ఇంటర్వ్యూలో నివేదా పేతురాజ్ మాట్లాడుతూ.. ఆస్కతికర వ్యాఖ్యలు చేసింది. ఈ రోజుల్లో అందరూ లవ్ చేయడం లేదా డేటింగ్ చేస్తున్నారు. చాలా మంది సింగిల్ గా ఉండటానికి భయపడుతున్నారు అని తెలిపింది. అలాగే అమ్మాయిలు డేటింగ్ చేసే ముందు ఆ అబ్బాయి గురించి బాగా తెలుసుకోవాలి. ముందు ఫ్రెండ్షిప్ చేసి ఆ తర్వాత డేటింగ్ చేయాలి అని చెప్పుకొచ్చింది.